


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 09-02-2026 | సంపుటి - 26 | సంచిక -261 | రూ : 4 | పేజీలు: 8




2లో

## ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్నిప్రమాదం
## ఆ వార్తలు నమ్మొద్దన్న శిఖా గోయల్

- హైదరాబాద్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్నిప్రమాదం
- 'ఓటుకు నోటు' కేసు ఆధారాలు కాలిపోయాయన్నది అసత్యం
- సాక్ష్యాలన్నీ 2021లోనే కోర్టుకు ఇచ్చామన్న డైరెక్టర్ శిఖా గోయల్
- ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన మెటీరియల్స్ కూడా సురక్షితం
- కొన్ని డాక్యుమెంట్లు మాత్రమే కాలిపోయాయని, డేటాకు నష్టం లేదని స్పష్టీకరణ

### భార్యాభర్తల మాటలు కూడా విన్నారు
# కేసీఆర్‌పై రేవంత్ ఫైర్

- ఫోన్ ట్యాపింగ్‌తో బీఆర్ఎస్ బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేసిందన్న సీఎం రేవంత్
- బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీలూ ఒక్కటేనని ఆరోపణ
- వేల కోట్లు సంపాదించిన కేసీఆర్ పేదలకు ఇళ్లు కట్టలేదన్న విమర్శ
- కాళేశ్వరం కుంభకోణంపై సీబీఐ విచారణకు ఆదేశించాలన్న డిమాండ్
- జిల్లాల రద్దుపై వస్తున్న ప్రచారంలో నిజం లేదని స్పష్టీకరణ

2లో



### యాసంగి రైతు భరోసాపై కీలక అప్‌డేట్..
## నిధుల విడుదల ఎప్పుడంటే..!

- యాసంగి రైతు భరోసా కోసం ప్రభుత్వ కసరత్తు
- నిధుల కోసం బహిరంగ మార్కెట్ నుంచి రూ.9,000 కోట్ల రుణం
- ఈ నెల 10న ఆర్బీఐ ద్వారా నిధుల సమీకరణకు ప్లాన్
- మున్సిపల్ ఎన్నికల తర్వాతే నిధులు జమ చేస్తామన్న సీఎం రేవంత్

2లో





2లో

### బంగ్లాదేశ్ ఎన్నికలు
## ఒక నాటకం

- అవి ప్రజాస్వామ్యబద్ధంగా జరగడం లేదు
- అధికారంలోకి ఎవరొచ్చినా సంక్షోభం తప్పదు
- పాక్‌తో స్నేహానికి యూనస్ వెంపర్లాడుతున్నారు
- 'ఈటీవీ భారత్' ప్రత్యేక ఇంటర్వ్యూలో మాజీ ప్రధాని షేక్ హసీనా

### భారత్-మలేషియా బంధానికి
## తమిళమే వారధి : ప్రధాని



2లో

- భారత్, మలేషియాలను తమిళ భాష కలుపుతోందన్న ప్రధాని
- ఇరు దేశాల మధ్య ఆడియో విజువల్ ఒప్పందంపై హర్షం
- మలేషియాలో 12,000 మందితో ప్రధాని మోదీ భారీ సభ
- మలేషియా ప్రధానికి ఎంజీఆర్ పాటలంటే ఇష్టమన్న మోదీ

### గిరిజన ఆశ్రమ పాఠశాలలో
## ఫుడ్ పాయిజనింగ్..
### విచారణకు ఆదేశించిన సీఎం చంద్రబాబు

- దేవరపల్లి గిరిజన ఆశ్రమ హాస్టల్‌లో ఫుడ్ పాయిజనింగ్
- 92 మంది విద్యార్థులకు వాంతులు, కడుపునొప్పి
- ఘటనపై విచారణకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం
- బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని సీఎం హెచ్చరిక
- విద్యార్థులందరి ఆరోగ్యం నిలకడగా ఉందని వెల్లడి



2లో

### టీ20 ప్రపంచకప్‌లో బోణీ కొట్టిన ఆతిథ్య శ్రీలంక
## ఐర్లాండ్‌పై ఘన విజయం



2లో

- టీ20 ప్రపంచకప్‌లో శ్రీలంక శుభారంభం
- ఐర్లాండ్‌పై 20 పరుగుల తేడాతో విజయం
- అర్ధశతకంతో రాణించిన కుశాల్ మెండిస్
- చెరో మూడు వికెట్లతో చెలరేగిన హసరంగ, తీక్షణ

# బంగ్లాదేశ్ ఎన్నికలు ఒక నాటకం

బంగ్లాదేశ్‌లో సార్వత్రిక ఎన్నికలను ఓ నాటకంగా అభివర్ణించారు ఆ దేశ మాజీ ప్రధాని, అవామీ లీగ్ అధ్యక్షురాలు షేక్ హసీనా. దేశంలోని అతి పెద్ద రాజకీయ పక్షమైన తమ పార్టీ(అవామీ లీగ్)ని పోటీ చేయకుండా నిషేధించి నిర్వహించే ఈ ఎన్నికలకు ఎలాంటి విలువ ఉండదని పేర్కొన్నారు. ఎన్నికల అనంతరం ఏర్పడే ఏ ప్రభుత్వమైనా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. 2024 ఆగస్టులో విద్యార్థుల ఉద్యమం కారణంగా హసీనా ప్రభుత్వం కుప్పకూలిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఆమె భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. ఒక అక్రమ వ్యవస్థకు చట్టబద్ధత కల్పించడం కోసం జరుగుతున్న నాటకంలో భాగమే ఈ ఎన్నికలు. ఒక్క బంగ్లాదేశీ ఓటు కూడా పొందని మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం దేశ చరిత్రలో తొమ్మిదిసార్లు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన అవామీ లీగ్‌ను నిషేధించింది. తద్వారా లక్షల మంది ప్రజలను ఓటు హక్కుకు దూరం చేసింది. పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ(బీఎన్‌పీ) లేదా జమాత్‌ఎఇస్లామీ అనుబంధ వర్గాలకు చెందని వారు ఎవరైనా నామినేషన్ పత్రాలను కొనాలని చూస్తే, పోలీసులు వారిని అరెస్టు చేస్తున్నారు. ఈ నామమాత్రపు ఎన్నికల ప్రక్రియ ద్వారా ఎవరు అధికారంలోకి వచ్చినా, మొదటి రోజే సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. నా రాజకీయ ప్రత్యర్థులు తమకు అనుకూలమైన వారితో కోర్టును నింపేశారు. నాకు నచ్చిన న్యాయవాదిని ఎంచుకునే హక్కును నిరాకరించారు. అవామీ లీగ్‌పై సానుభూతి ఉన్న న్యాయవాదులను జాబితా నుంచి తొలగించి, వారి స్థానంలో చట్టపరమైన పరిజ్ఞానం లేని, ప్రభుత్వం నియమించిన వ్యక్తులను ఉంచారు. విచారణ ప్రారంభం కాకముందే ప్రభుత్వ అధికారులు బహిరంగంగా నేను నేరస్థురాలినని ప్రకటించారు. ప్రజల ద్వారా ఎన్నికవ్వని ప్రభుత్వం కింద అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ పనిచేస్తోంది. ఇది కేవలం అవామీ లీగ్ సభ్యులనే లక్ష్యంగా చేసుకుని విచారణలు నిర్వహిస్తోంది. నేను ఎవరినీ చంపాలని ఆదేశాలివ్వలేదు. దేశంలో హింస చెలరేగి, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసమవుతున్నప్పుడు, ఒక బాధ్యతాయుతమైన దేశాధినేతగా శాంతిభద్రతలను పునరుద్ధరించడానికి ప్రయత్నించాను. పరిస్థితులు వేగంగా మారడంతో పరిస్థితి చేయి దాటింది. అప్పుడు జరిగిన మరణాలపై విచారణ జరిపించడానికి ఓ కమిటీని నియమించాను. దురదృష్టవశాత్తు యూనస్ అధికారం చేపట్టగానే దాన్ని రద్దు చేశారు. బహుశా ఆ నివేదిక తననే దోషిగా తేలుస్తుందని ఆయనకు తెలుసేమో.

# టీ20 ప్రపంచకప్‌లో బోణీ కొట్టిన ఆతిథ్య శ్రీలంక... ఐర్లాండ్‌పై ఘన విజయం

టీ20 ప్రపంచకప్‌లో ఆతిథ్య శ్రీలంక గెలుపు బోణీ కొట్టింది. కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో ఆదివారం జరిగిన గ్రూప్‌బి మ్యాచ్‌లో ఐర్లాండ్‌పై 20 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్, ఆ తర్వాత బౌలింగ్‌లో సమష్టిగా రాణించి టోర్నీలో శుభారంభం చేసింది. 164 పరుగుల లక్ష్య ఛేదనలో ఐర్లాండ్ 19.5 ఓవర్లలో 143 పరుగులకు ఆలౌట్ అయింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంకకు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలినా, వికెట్ కీపర్ కుశాల్ మెండిస్ (43 బంతుల్లో 56 నాటౌట్) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. చివరి ఓవర్లలో కమిందు మెండిస్ (19 బంతుల్లో 44) మెరుపు ఇన్నింగ్స్ ఆడటంతో లంక స్కోరు ఊపందుకుంది. వీరిద్దరి ప్రదర్శనతో శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసింది. ఐర్లాండ్ బౌలర్లలో జార్జ్ డాక్‌రెల్, బారీ మెక్‌కార్తీ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన ఐర్లాండ్‌ను లంక స్పిన్నర్లు వణికించారు.

# భార్యాభర్తల మాటలు కూడా విన్నారు : కేసీఆర్‌పై రేవంత్ ఫైర్



గత బీఆర్ఎస్ పాలనలో ఫోన్ ట్యాపింగ్ ద్వారా ప్రజలను బ్లాక్‌మెయిల్ చేశారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ అంటే 'బ్లాక్‌మెయిల్ రాజకీయ సమితి' అని అభివర్ణించిన ఆయన, ఫోన్ ట్యాపింగ్‌తో వందల కోట్లు దోచుకున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ ఖాతాలో ఉన్న రూ.1,500 కోట్లు అక్రమ మార్గాల్లో సంపాదించినవేనని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ములుగు జిల్లాలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. పదేళ్ల పాలనలో అధికారాన్ని దుర్వినియోగం చేసి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అక్రమ సంపదను కూడబెట్టారని రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. వ్యాపారవేత్తల ఫోన్లు ట్యాప్ చేసి, వారి ఆస్తులను బలవంతంగా బదిలీ చేయించుకున్నారని బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి చెప్పిన విషయాన్ని సీఎం గుర్తుచేశారు. ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులు, న్యాయమూర్తులు, సినీ తారలనే కాకుండా చివరికి భార్యాభర్తల మధ్య సంభాషణలను కూడా విన్నారని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాళేశ్వరం, ఫార్ములా ఈ రేస్ కుంభకోణాలపై సీబీఐ విచారణకు ఆదేశించకపోవడంపై కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి 'కిషన్ రావు'గా మారి కేసీఆర్‌కు దత్తపుత్రుడిగా మారారని ఎద్దేవా చేశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై సీబీఐ, ఈడీ కేసులు పెట్టిన కేంద్రం, కాళేశ్వరం స్కామ్‌పై విచారణకు ఎందుకు వెనుకాడుతోందని ప్రశ్నించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులను కిషన్ రెడ్డి కాపాడుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీలు ఒకే నాణేనికి రెండు ముఖాలని, కాంగ్రెస్‌ను ఓడించేందుకు రెండు పార్టీలు కుమ్మక్కయ్యాయని అన్నారు. కేసీఆర్ కుటుంబం టీవీ ఛానెళ్లు, వార్తాపత్రికలతో వేల కోట్ల వ్యాపారాలు సంపాదించింది కానీ, పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టివ్వలేదని రేవంత్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తోందని, రూ.22,500 కోట్లతో 4.5 లక్షల ఇళ్లు కట్టిస్తున్నామని తెలిపారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని, భూపాలపల్లి జిల్లాను రద్దు చేస్తారనేది అవాస్తవమని స్పష్టం చేశారు. అసెంబ్లీలో చర్చించకుండా, ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా ఏ జిల్లాను రద్దు చేసేది లేదని హామీ ఇచ్చారు.

# ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్నిప్రమాదం: ఆ వార్తలు నమ్మొద్దన్న శిఖా గోయల్

హైదరాబాద్ : హైదరాబాద్ నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్)లో శనివారం ఉదయం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో, గతంలో సంచలనం సృష్టించిన 'ఓటుకు నోటు', 'ఫోన్ ట్యాపింగ్' కేసులకు సంబంధించిన కీలక ఆధారాలు కాలిపోయాయంటూ సోషల్ మీడియాలో, కొన్ని మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం జరిగింది. అయితే ఈ ప్రచారాన్ని ఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ శిఖా గోయల్ తీవ్రంగా ఖండించారు. కీలక కేసులకు సంబంధించిన ఆధారాలన్నీ సురక్షితంగా ఉన్నాయని, ఎలాంటి డేటా నష్టం జరగలేదని ఆమె స్పష్టం చేశారు. శనివారం ఉదయం 10:08 గంటల సమయంలో ల్యాబ్ కార్యాలయంలోని సీజ్డ్ ప్రాపర్టీస్ విభాగంలో మంటలు చెలరేగాయి. అక్కడి సిబ్బంది గమనించి వెంటనే అప్రమత్తమైనప్పటికీ, మంటలు వేగంగా ల్యాబ్‌తో పాటు శిక్షణా కేంద్రానికి వ్యాపించాయి. ఈ ప్రమాదంలో కొన్ని అనాలసిస్ డాక్యుమెంట్ ఫైళ్లు మాత్రమే దగ్ధమయ్యాయని, వాటిని కూడా రికవరీ చేసే ప్రక్రియ కొనసాగుతోందని శిఖా గోయల్ వివరించారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని, ప్రాణనష్టం జరగలేదని తెలిపారు. ముఖ్యంగా, తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు రేపిన 2015 నాటి 'ఓటుకు నోటు' కేసుకు సంబంధించిన ఆధారాలు ధ్వంసమయ్యాయని వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని ఆమె తేల్చిచెప్పారు. ఆ కేసుకు సంబంధించిన 16 మెటీరియల్ ఆబ్జెక్టులను 2015లోనే స్వీకరించి, పరీక్షించిన తర్వాత 2021 మార్చిలోనే ఏసీబీ కోర్టుకు తిరిగి సమర్పించామని స్పష్టం చేశారు. ప్రమాదం జరిగినప్పుడు ఈ కేసుకు సంబంధించిన ఒక్క ఆధారం కూడా ఎఫ్ఎస్ఎల్‌లో లేదని ఆమె తెలిపారు. అదేవిధంగా, ఇటీవలి ఫోన్ ట్యాపింగ్ కేసుకు (పంజాగుట్ట పీఎస్ క్రైమ్ నెం. 243/2024) సంబంధించి మార్చి 2024 నుంచి జనవరి 2026 మధ్య అందిన 132 మెటీరియల్ ఆబ్జెక్టులను పూర్తిగా పరిశీలించామని, వాటన్నింటినీ సురక్షితంగా వెలికితీశామని గోయల్ చెప్పారు. వాటి నివేదికలు ఇప్పటికే కొన్ని కోర్టుకు సమర్పించగా, మరికొన్ని సిద్ధమవుతున్నాయని అన్నారు. ఒకవేళ ఏవైనా డాక్యుమెంట్లు కాలిపోయినా, వాటి డేటాను తిరిగి పొందే సాంకేతిక సామర్థ్యం తమ బృందానికి ఉందని, ఆధారాల భద్రత విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉంటామని ఆమె హామీ ఇచ్చారు. ల్యాబ్‌లో కాలిపోయినవి ఇప్పటికే కోర్టులకు సమర్పించిన డాక్యుమెంట్ల కాపీలేనని, ఒరిజినల్స్ కోర్టు వద్ద భద్రంగా ఉంటాయని ఆమె పునరుద్ఘాటించారు. ఈ అగ్నిప్రమాదంపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# భారత్-మలేషియా బంధానికి తమిళమే వారధి

ఢిల్లీ : భారత్, మలేషియా మధ్య సాంస్కృతిక సంబంధాలను తమిళ భాష బలంగా పెనవేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇరు దేశాల మధ్య తాజాగా కుదిరిన ఆడియో విజువల్ ఒప్పందం ద్వారా తమిళ చిత్రాలు, సంగీతం మన హృదయాలను మరింత దగ్గర చేస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కౌలాలంపూర్‌లో మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో కలిసి ఆదివారం నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. మలేషియా విద్య, మీడియా, సాంస్కృతిక జీవనంలో తమిళ భాషకు బలమైన, సజీవమైన ఉనికి ఉందని మోదీ ప్రశంసించారు. అంతకుముందు శనివారం జరిగిన 'సెలమత్ దతాంగ్ మోదీజీ' కార్యక్రమంలో 12,000 మందికి పైగా ప్రవాస భారతీయులు, స్నేహితులు పాల్గొన్నారు. ఈ సభకు మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం కూడా హాజరయ్యారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ప్రవాస భారతీయ సమాజం మలేషియాలో ఉందని, ఇరు దేశాల ప్రజల హృదయాలను కలిపే అంశాలు చాలా ఉన్నాయని ప్రధాని పేర్కొన్నారు. మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంకు లెజెండరీ నటుడు ఎంజీఆర్ పాటలంటే ఎంతో ఇష్టమని మోదీ గుర్తుచేశారు. బటు కేవ్స్‌లో జరిగిన తైపూసం వేడుకలు, మలేషియాలో గర్బా నృత్యం ప్రాచుర్యం పొందడం మన సాంస్కృతిక బంధానికి నిదర్శనమని అన్నారు. తమిళం ప్రపంచానికి భారత్ ఇచ్చిన గొప్ప బహుమతి అని, తమిళ సాహిత్యం శాశ్వతమైనదని కొనియాడారు. భారత ఉపరాష్ట్రపతి, విదేశాంగ, ఆర్థిక మంత్రులు తమిళనాడుకు చెందినవారేనని ఆయన సభలో ప్రస్తావించారు. ఈ చారిత్రక స్ఫూర్తితో, ఇప్పటికే ఉన్న తిరువళ్లువర్ చైర్‌కు అదనంగా మలయా యూనివర్సిటీలో 'తిరువళ్లువర్ సెంటర్'ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు.

# యాసంగి రైతు భరోసాపై కీలక అప్‌డేట్.. నిధుల విడుదల ఎప్పుడంటే..!



కర్ణాటక : తెలంగాణ రైతులకు యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా నిధులను అందించేందుకు ప్రభుత్వం భారీ కసరత్తు ప్రారంభించింది. నిధుల సమీకరణ కోసం బహిరంగ మార్కెట్ నుంచి ఏకంగా రూ.9,000 కోట్లు రుణం తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు (ఆర్బీఐ) ఇండెంట్ సమర్పించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇంత పెద్ద మొత్తంలో ఒకేసారి రుణం సేకరించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఈ నెల 10వ తేదీన ఆర్బీఐ నిర్వహించే ఈవేలం ద్వారా ఈ రుణాన్ని సమీకరించనున్నారు. 13 ఏళ్ల కాలపరిమితితో రూ.2,000 కోట్లు, 16 ఏళ్లకు మరో రూ.2,000 కోట్లు, 21 ఏళ్ల కాలపరిమితితో రూ.2,500 కోట్లు, 27 ఏళ్లకు రూ.2,500 కోట్ల చొప్పున ప్రభుత్వం రుణం తీసుకోనుంది. ఈవేలం ప్రక్రియ పూర్తయిన తర్వాత నిధులు ప్రభుత్వ ఖజానాకు చేరతాయి. అనంతరం రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసే ప్రక్రియను ప్రారంభించే అవకాశముంది. ఇప్పటికే యాసంగి సీజన్‌కు సంబంధించి అర్హులైన రైతుల జాబితా కూడా సిద్ధమైనట్లు సమాచారం. అయితే, ఈ నిధుల విడుదలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవలే ఒక స్పష్టత ఇచ్చారు. మిర్యాలగూడలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు పూర్తయిన వెంటనే రైతు భరోసా నిధులను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. దీంతో నిధుల సమీకరణ ప్రక్రియ పూర్తయినా, రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కావడానికి మరికొంత సమయం పట్టే అవకాశం కనిపిస్తోంది. తమ ప్రభుత్వం పార్టీలకతీతంగా, ఎలాంటి వివక్ష లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని సీఎం తెలిపారు. ఇప్పటికే పంట రుణాల మాఫీ కింద రైతులకు రూ.21 వేల కోట్లు అందించామని, సన్న వడ్లకు రూ.500 బోనస్ కూడా ఇచ్చామని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

# రేపు సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శుల సమావేశం

రాష్ట్ర పాలన, అభివృద్ధి లక్ష్యాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. సచివాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ఈ సుదీర్ఘ సమీక్ష జరగనుంది. ఈ సమావేశానికి మంత్రులు, ప్రభుత్వ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు హాజరుకానుండగా, జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు వర్చువల్ విధానంలో పాల్గొంటారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించి, అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. ప్రధానంగా 'స్వర్ణాంధ్ర విజన్ 2047'లో భాగంగా నిర్దేశించుకున్న లక్ష్యాలు, పాలనలో పారదర్శకత, సామర్థ్యం పెంచేందుకు రూపొందించిన పది సూత్రాల అమలు పురోగతిపై చర్చించనున్నారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్డీపీ) వృద్ధి రేటును పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. ఆదాయాన్ని ఆర్జించే శాఖల పనితీరు, కేంద్ర ప్రాయోజిత పథకాల అమలుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికపై కూడా ఈ సమావేశంలో సమీక్ష జరగనుంది. రాష్ట్రంలోకి వచ్చిన పెట్టుబడులు, పబ్లిక్‌ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో చేపట్టిన ప్రాజెక్టుల పురోగతిని సీఎం విశ్లేషించనున్నారు. రియల్ టైమ్ గవర్నెన్స్‌లో భాగంగా అవేర్, డేటా లేక్ వంటి వ్యవస్థల వినియోగం, పాలనలో కృత్రిమ మేధ (ఏఐ) టూల్స్, ఇతర ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించుకోవడంపై సీఎం దిశానిర్దేశం చేయనున్నారు. వీటితో పాటు రాష్ట్ర యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించడం, 'వన్ ఫ్యామిలీ, వన్ ఎంట్రప్రెన్యూర్' విధానం అమలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రాష్ట్ర ర్యాంకును మెరుగుపరచడం, శాంతిభద్రతల పరిస్థితిపై కూడా సమీక్షించనున్నారు. 202627 ఆర్థిక సంవత్సరంలో వివిధ శాఖలు సాధించాల్సిన లక్ష్యాలు, చేపట్టాల్సిన కార్యాచరణపై మంత్రులు, కార్యదర్శులు, జిల్లా స్థాయి అధికారులకు సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయనున్నారు.

# గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్... విచారణకు ఆదేశించిన సీఎం చంద్రబాబు



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం జిల్లాలో గల ఓ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్ ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనలో 92 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విచారణకు ఆదేశించారు. బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. సోమవారం లోగా దీనిపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. వివరాల్లోకి వెళ్తే.. పోలవరం జిల్లా రంపచోడవరం మండలం దేవరపల్లిలోని ఆశ్రమ బాలుర వసతి గృహంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఆదివారం ముఖ్యమంత్రి కార్యాలయ (సీఎంవో) అధికారులతో చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించి వివరాలు తెలుసుకున్నారు. శనివారం ఉదయం అల్పాహారం తిన్న తర్వాత 92 మంది విద్యార్థులకు వాంతులు, కడుపునొప్పి, జ్వరం, విరేచనాలు వంటి లక్షణాలు కనిపించాయని అధికారులు సీఎంకు వివరించారు. వెంటనే వారిని మారేడుమిల్లి, రంపచోడవరంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందించినట్లు తెలిపారు. ప్రస్తుతం విద్యార్థులందరి ఆరోగ్యం నిలకడగా ఉందని వారు పేర్కొన్నారు. ఘటన జరిగిన వెంటనే హాస్టల్‌ను తనిఖీ చేసి అక్కడి పరిస్థితులను అంచనా వేశామని అధికారులు తెలిపారు. హాస్టల్‌లో ఉన్న మిగతా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, లక్షణాలు ఉన్నవారికి చికిత్స అందించారు. ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు, ఆహారం, నీటి నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం పంపినట్లు వివరించారు. ఈ ఘటనపై విచారణకు ఒక జాయింట్ ఇన్స్‌పెక్షన్ కమిటీని కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఘటనపై సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. బాధ్యులపై శాఖాపరమైన చర్యలతో పాటు, అవసరమైతే క్రిమినల్ చర్యలు కూడా తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

## మాధవి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



కూకట్ పల్లి, ప్రజాస్ఫూర్తి : మాధవి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం కాలనీ సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులుగా యమ్. రామ్ మోహన్ రావు, ప్రెసిడెంట్‌గా సిహెచ్. చిన్నారెడ్డి వైస్ ప్రెసిడెంట్స్‌గా హెచ్. రామారావు, ఏ. అనిల్, జనరల్ సెక్రటరీగా వై. రఘుకుమార్, జాయింట్ సెక్రటరీలుగా వి. మల్లికార్జున్, పి.టి.వి. సత్యనారాయణ, ట్రెజరర్‌గా సిహెచ్. నవీన్ కుమార్, జాయింట్ ట్రెజరర్‌గా ఎన్. వీర కుమార్, కార్యవర్గ సభ్యులుగా ఏ. హనుమంతరావు, కె. బాలాజీ, ఆర్. జయపాల్ రెడ్డి, జె. సత్యనారాయణ, ఆర్. శ్రవణ్ కుమార్, వి. రాంబాబు, ఎం. సురేష్ బాబు, డి. అజయ్ కుమార్, ఆర్. అంజి బాబు, వి. శివకుమార్, యస్. చిన్నపరెడ్డి, జి. కృష్ణార్జునరావు, సిహెచ్. భాస్కర్, పి. వంశీకృష్ణ, ఈ. ఆంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ మాధవి నగర్ కాలనీ అభివృద్ధి, శుభ్రత, భద్రత, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణకు సమిష్టిగా కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు నూతన కమిటీకి అభినందనలు తెలియజేశారు. కాలనీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం లక్ష్యంగా ఈ కమిటీని ఎన్నుకున్నారు.

## 15వ డివిజన్ లో ఎంపీ రఘురాం రెడ్డి పర్యటన


* **సింగరేణి స్థలంలో బ్యాంక్ ఏర్పాటు చేయాలని వ్యాపారుల విజ్ఞప్తి**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి ఆదివారం రామవరం 15వ డివిజన్ లో పర్యటించారు. ఈ సందర్భంగా రామవరం పరిధిలోని సింగరేణి ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. ఆ స్థలంలో బ్యాంక్ ఏర్పాటు చేయాలని స్థానిక వ్యాపారులు ఎంపీని కోరారు. బ్యాంక్ ఏర్పాటు చేస్తే వ్యాపార కార్యకలాపాలకు ఊతమిస్తుందని వారు వివరించారు.15వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆకునూరి సుప్రియకు మద్దతుగా ఎంపీ ప్రచారం నిర్వహించారు. ఆకునూరి సుప్రియ భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.ఆకునూరి కనకరాజు ఆధ్వర్యంలో స్థానిక సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు తోటా దేవి ప్రసన్న, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు, వ్యాపార సంఘం ప్రతినిధులు, డివిజన్ అభ్యర్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ నగర్ లో అన్ని వీధులలో 3 ఫేజ్ లైన్ ఏర్పాటు చేయాలి

* **కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పచ్చిమట్ల నరేందర్ గౌడ్**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : చింతల్ డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్ లో విద్యుత్ లోడు ఎక్కువ అవుతున్నందున అన్ని వీధులలో 3 ఫేజ్ లైన్ ఏర్పాటు చేయాలని భగత్ సింగ్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పచ్చిమట్ల నరేందర్ గౌడ్ అన్నారు. పల్లెబాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం చింతల్ డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్ లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజ్గిరి విద్యుత్ అధికారులు ఎస్.సి కరుణాకర్ బాబు, డీఈ జైన్ రాజు, ఎడీఈ శ్రీకాంత్, ఎఈ రాధాకృష్ణారెడ్డి, ఎల్ ఐ నారాయణస్వామి, విద్యుత్ సిబ్బంది కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో కొన్ని విద్యుత్ స్తంభాలు శిథిలావస్థలో ఉన్నాయని, వాటిని పరిశీలించి, కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేయాలన్నారు. ట్రాన్స్ఫార్మర్ల చుట్టూ విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయని, కావున వాటి చుట్టూ ఫెన్సింగ్ వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సంకరి ప్రతాప్ రెడ్డి, కమిటీ సభ్యులు రాఘవులు, సాయిబాబా, రాము, శ్రీధర్ గౌడ్, ఈశ్వర్, ప్రభాకర్, కృష్ణారెడ్డి, శివ పాటిల్, ప్రదీప్ రెడ్డి, జితేందర్ రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు..

## సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడంలో జర్నలిస్టులు ముందుండాలి

* **టియుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ**



ఉప్పల్, ప్రజాస్ఫూర్తి : సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడంలో జర్నలిస్టులు ముందుండాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ( టీయూడబ్ల్యూజే ) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ పేర్కొన్నారు. ఆదివారం టీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దొంతుల వెంకట్ రామ్ రెడ్డి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసిన ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులు తమ సంక్షేమ కార్యక్రమాలతో పాటు సామాజిక రుగ్మతులపై వివిధ ప్రజా సంఘాలతో కలుపుకొని ప్రజా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జర్నలిజంలో నానాటికి పెరిగిపోతున్న పెడ ధోరణులను అరికట్టి, జర్నలిజం విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి జర్నలిస్టుపై ఉందన్నారు. జర్నలిస్టుల పక్షాన టీయూడబ్ల్యూజే నిరంతరం పోరాటం సలుపుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఉప్పల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గ్యరంపల్లి శివాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ పారేల్లి సాగర్, ఉపాధ్యక్షులు ఏవి శ్రీధర్ రావు, కూకుట్ల నరోత్తం రెడ్డి, కోశాధికారి గుత్తి శేఖర్, జాయింట్ సెక్రటరీ దాస రాజు మరియు సలహాదారులు కొలనుపాక చంద్రమౌళి, కోడికంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మా ఇంటి ఓట్లు అమ్మబడవు

* **రామవరం 16వ డివిజన్‌లో బోర్డు ఏర్పాటు చేసిన ఓ కుటుంబ**
* **ఓటర్లను ఆలోచింపచేస్తున్న సందేశం**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల వేళ రాజకీయ పార్టీల అభ్యర్థులు గెలుపు కోసం హోరాహోరీగా ప్రచారం కొనసాగిస్తున్నారు. ఓటర్లను ఆకర్షించేందుకు ప్రతి పార్టీ ప్రత్యేక వ్యూహాలతో ముందుకు సాగుతుండగా, రామవరం 16వ డివిజన్‌లో ఓ కుటుంబం ఏర్పాటు చేసిన బోర్డు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రామవరం నెహ్రూబస్తీలో నివాసముంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు కోరి సందీప్ కుమార్ తన ఇంటి ముందు ''మా ఇంటి ఓట్లు అమ్మబడవు - దయచేసి గమనించగలరు'' అనే సందేశంతో బోర్డు ఏర్పాటు చేశారు. ఈ బోర్డు స్థానికంగా ప్రజల్లో చైతన్యం కలిగించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల సమయంలో కొంతమంది ఓటర్లను డబ్బులు, బహుమతులు వంటి ప్రలోభాలతో ఆకర్షించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, అలాంటి చర్యలకు తాము వ్యతిరేకమనే సంకేతంగా ఈ బోర్డు పెట్టినట్లు సందీప్ కుమార్, ఝాన్సీ తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువను కాపాడాలని, అభివృద్ధి, ప్రజాసేవను ఆధారంగా చేసుకుని ఓటు వేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ బోర్డు ఏర్పాటు విషయం స్థానికంగా చర్చకు దారితీసింది. కొందరు ప్రజలు దీనిని అభినందిస్తుండగా, మరికొందరు ఎన్నికల సమయంలో ఇలాంటి సందేశాలు ప్రజల్లో అవగాహన పెంచుతాయని అభిప్రాయపడుతున్నారు. సోషల్ మీడియాలో కూడా ఈ బోర్డు ఫోటోలు వైరల్ అవుతూ చర్చకు దారితీస్తున్నాయి. ఇక రామవరం 16వ డివిజన్‌లో ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపు కోసం తీవ్రంగా ప్రచారం కొనసాగిస్తుండగా, ఓటర్ల మద్దతు ఎవరికి లభిస్తుందనే అంశంపై ఆసక్తి నెలకొంది. అయితే ఓటు విలువపై అవగాహన కల్పించే ఈ ప్రయత్నం ఎన్నికల వేళ ప్రత్యేక ఆకర్షణగా మారింది.

## ప్రచార ముగింపు వేళ కార్నర్ మీటింగ్స్

* **నేడు కొత్తగూడెంలో పొంగులేటి, ఎంపీ రఘురాం రెడ్డి**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కార్పొరేషన్ ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో కాంగ్రెస్, మిత్రపక్షం సీపీఎం అభ్యర్థుల విజయాన్ని ఆకాంక్షిస్తూ సోమవారం కార్నర్ మీటింగ్స్ నిర్వహించనున్నారు. ఈ సమావేశాలకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించనున్నారు. ఉదయం 9 గంటలకు త్రీ టౌన్ కూడలి వద్ద, ఉదయం 11 గంటలకు రామవరంలో కార్నర్ మీటింగ్స్ నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. కొత్తగూడెం పట్టణంలోని కాంగ్రెస్, సీపీఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

## కార్పొరేషన్ ఎన్నికల్లో వింత పరిస్థితి..!

* **అభ్యర్థి వెంట జనం సందడి...**
* **స్థానిక సమస్యలే ప్రధాన అంశాలుగా ప్రచారం**
* **ఓటు ఎవరికోనని అభ్యర్థుల్లో అయోమయం!!**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికలు రోజురోజుకు రసవత్తరంగా మారుతున్నాయి. కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్ ప్రాంతాలను కలుపుకొని ఉన్న 60 డివిజన్లలో ప్రచారం జోరుగా సాగుతున్నా, ఓటర్లు చివరకు ఎవరికి మద్దతు ఇస్తారనే అంశంపై అభ్యర్థుల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. జోరుగా సాగుతున్న ప్రచారంలో ప్రజలు ప్రతీ అభ్యర్థికి పట్టం కడుతున్నారు. మీకే ఓటు వేస్తామంటూ వాగ్దానాలిస్తున్నారు. అంతేకాకుండా ప్రచారంలో వారివెంట నడుస్తున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థుల తరఫున మంత్రులు, ముఖ్య నాయకులు ప్రచారానికి వచ్చిన సందర్భంలో వేల సంఖ్యలో ప్రజలు హాజరవుతుండటంతో తమదే గెలుపు అనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే చివరకు మాత్రం ఓటర్లు ఎవరికివైపు నిలుస్తారనేది మాత్రం సందిగ్ధంగానే ఉంది. అభ్యర్థులు పార్టీలు మారినట్లుగా ఓటర్లు కూడా కప్పగంతులు వేస్తారేమోనని ముందుగానే కొందరు అభ్యర్థులు అలర్ట్ అవుతున్నారు. అంతేకాకుండా ప్రచారానికి వచ్చిన వారికి ఏమాత్రం తక్కువ చేయకుండా బిర్యానీలు, మందు, డబ్బులు అందిస్తూ వారిని ప్రసన్నం చేసుకుంటున్నారు. బయటి ప్రాంతాల వారు కాకుండా తమ స్వంత వారితోనే ప్రచారానికి వెళ్తుండటంతో అభ్యర్థులకు ధీమా వస్తోంది. కాని ఓటరన్న చివరిరోజు తన మనసు మార్చుకోకుండా ఉంటే చాలు అనుకుంటూ అభ్యర్థులు దేవుడిని వేడుకుంటున్నారు.

* **రెబల్స్ తో ప్రధాన పార్టీలకు టెన్షన్**

అన్ని పార్టీల అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం నిర్వసిస్తూ ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నప్పటికీ కొన్ని డివిజన్లలో మాత్రం పార్టీల బిఫారమ్‌లు పొందిన అభ్యర్థులు రెబల్స్‌తో బెంబేలెత్తిపోతున్నారు. ఓట్లు ఎక్కడ చీలుతాయోనని ఆందోళనకు గురవుతున్నారు. పార్టీలకు పట్టు ఉన్నప్పటికీ, స్థానికంగా కొందరు రెబల్స్‌కు కూడా పలుకుబడి, ప్రజల్లో మంచిపేరు ఉండటంతో వారు ముప్పుగా మారుతారని అందోళన చెందుతున్నారు. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, బీజేపీ, జనసేన పార్టీలలో టికెట్ ఆశించి అవకాశం రాకపోవడంతో పలువురు నాయకులు స్వతంత్రులుగా బరిలోకి దిగారు. దీంతో సంప్రదాయ ఓటు బ్యాంక్ విభజన చెందే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతేకాక కొన్ని డివిజన్లలో రెబల్ అభ్యర్థుల ప్రభావంతో పార్టీల కార్యకర్తలు రెండు వర్గాలుగా విడిపోయిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రచార కార్యక్రమాల్లో సమన్వయం లోపిస్తున్నట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

**స్థానిక అంశాలే ప్రధానంగా ప్రచారం..**

కార్పొరేషన్ ఎన్నికల్లో రాష్ట్రస్థాయిలో ఇచ్చే హామీలకంటే స్థానిక అంశాలే ప్రధానంగా మారాయి. స్థానికంగా పార్కులు కట్టిస్తాం, ఉద్యోగావకాశాలు కల్పిస్తాం, గుడి, బడి, డ్రెయిన్లు, రోడ్లు వేయిస్తాం, డ్వాక్రా నిధులు ఇప్పిస్తాం, రుణాలు మంజూరు చేయిస్తాం, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, కుల, ఆదాయ సర్టిఫికెట్లు ఇప్పిస్తామంటూ ప్రచారం చేస్తూ స్థానిక అంశాలను లేవనెత్తుతూ ప్రచారం కొనసాగిస్తున్నారు. ఆయా పార్టీలకు కొన్నిచోట్ల పొత్తులు, మరికొన్ని చోట్ల పొత్తులు లేకపోవడంతో ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు లేదా వారి విధానాలను విమర్శించే పరిస్థితులు లేకపోవడంతో స్థానికంగా ఉన్న సమస్యలపైనే అభ్యర్థులు దృష్టిసారించి ప్రచారం చేస్తున్నారు. పార్టీ ప్రభావం కంటే అభ్యర్థుల వ్యక్తిగత పరిచయాలు, స్థానిక సమస్యల పరిష్కారం, సేవా కార్యక్రమాలు కీలకంగా మారే ఓటర్లపై ప్రభావం చూపే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడల ప్రారంభం



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా స్థాయి సీఎం కప్ 2025 26 (2వ ఎడిషన్) క్రీడా పోటీలను కొత్తగూడెంలోని సీఈఆర్ క్లబ్‌లో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడాకారులకు మంచి వేదికగా సీఎం కప్ నిలుస్తుందని తెలిపారు. వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకొని క్రీడల్లో పాల్గొనేందుకు క్రీడా శాఖ సమగ్ర ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించి జిల్లా స్థాయిలో విజయం సాధించి, రాష్ట్ర స్థాయిలో జిల్లా తరపున మరింత ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా నిర్వహించిన కరాటే, యోగా, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, అత్యపత్య, క్యారమ్స్, చెస్, బాల్ బ్యాడ్మింటన్, సాఫ్ట్ బాల్ హాకీ, నెట్‌బాల్, టైక్వాండో, బ్యాడ్మింటన్ వంటి మొత్తం 13 రకాల క్రీడలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. అనంతరం విజేతలకు మెడల్స్ అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి నాగలక్ష్మి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నరేష్‌తో పాటు వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, టైక్వాండో, కరాటే, బాక్సింగ్, యోగా, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. పోటీలలో మొత్తం 950 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

## డాక్టర్ ఎమ్ఆర్ఎస్ రాజు కు వివేకానంద ఇండియన్ ఐకాన్ అవార్డ్ ప్రదానం




కుత్బుల్లాపూర్ ,ప్రజాస్ఫూర్తి : ప్రజాసేవ, వైద్య శిబిరాలు, ప్రకృతిని కాపాడడం, పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి విపత్తులలో సహాయం వంటి కార్యక్రమాలతో నిరంతరం సామాజిక సేవలో ఉండే ప్రగతి నగర్ కు చెందిన వైద్యులు డాక్టర్ ఎమ్ఆర్ఎస్ రాజుకు విశ్వగురు వర్ల్డ్ రికార్డ్స్ వారి అరుదైన వివేకానంద ఇండియన్ ఐకాన్ అవార్డ్ ప్రదానం చేశారు. ఆదివారం సాయంత్రం ప్రసాద్ ఫిల్మ్ లాబొరేటరీలో, సంస్థ సిఈవో సత్యవోలు రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథి, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవి దేవి పాల్గొని వారి చేతుల మీదుగా ఈ అవార్డును డాక్టర్ రాజు అందుకున్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పాఠశాల, కళాశాల రోజుల నుండే ఎన్ఎస్ఎస్ లాంటి సేవా సంస్థలలో చేరి ఎన్నో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను నిర్వహించారని కొనియాడారు. యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ లీడర్ గా ఉంటూ 1986 గోదావరి వరదల్లో దెబ్బతిన్న గ్రామాలకు అన్ని విధాలా సహాయం, 2010 వరదల్లో ప్రజలను ఆదుకోవడం, తిరుమల కొండలపై వేలల్లో విత్తన బంతులు నాటడం మొదలైన కార్యక్రమాలు చేపట్టారన్నారు. లయన్స్ క్లబ్ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు, డయాబెటిస్ నిర్ధారణ పరీక్షలు, థలసీమియా బాధిత చిన్నారుల కోసం రక్తదాన శిబిరాలు, కోవిడ్ మహమ్మారి సమయంలో సేవాభారతి నిర్వహించిన ఐసోలేషన్ సెంటర్ లో రెసిడెంట్ డాక్టర్ గా 2 నెలల పాటు 24 గంటలు సేవలు... ఇలా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డాక్టర్ రాజు ప్రస్తుతం గీతా పరివార్ లో కోర్ ట్రైనర్ గా ఉచితంగా భగవద్గీత శ్లోకాలపై ఎంతో మందికి శిక్షణ అందిస్తున్నారని, వారికి అవార్డునివ్వడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ పోలీస్ సూపరింటెండెంట్ ఎస్ ఎమ్ రత్న, సీనియర్ ఆంకాలజిస్ట్, సింగరాజు క్యాన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ మల్లిక్ సింగరాజు, ప్రైమ్9 టీవీ సిఈవో వెంకటేశ్వర రావు, జయవారాహి గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ జి సురేంద్ర బాబు, ఎల్లా సుబ్బారెడ్డి, పూజిత, రవికాంత్, విజయకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ నగర్ లో అన్ని వీధులలో 3 ఫేజ్ లైన్ ఏర్పాటు చేయాలి

* **కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పచ్చిమట్ల నరేందర్ గౌడ్**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : చింతల్ డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్ లో విద్యుత్ లోడు ఎక్కువ అవుతున్నందున అన్ని వీధులలో 3 ఫేజ్ లైన్ ఏర్పాటు చేయాలని భగత్ సింగ్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పచ్చిమట్ల నరేందర్ గౌడ్ అన్నారు. పల్లెబాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం చింతల్ డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్ లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజ్గిరి విద్యుత్ అధికారులు ఎస్.సి కరుణాకర్ బాబు, డీఈ జైన్ రాజు, ఎడీఈ శ్రీకాంత్, ఎఈ రాధాకృష్ణారెడ్డి, ఎల్ ఐ నారాయణస్వామి , విద్యుత్ సిబ్బంది కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో కొన్ని విద్యుత్ స్తంభాలు శిథిలావస్థలో ఉన్నాయని, వాటిని పరిశీలించి, కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేయాలన్నారు. ట్రాన్స్ఫార్మర్ల చుట్టూ విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయని, కావున వాటి చుట్టూ ఫెన్సింగ్ వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సంకరి ప్రతాప్ రెడ్డి, కమిటీ సభ్యులు రాఘవులు, సాయిబాబా, రాము, శ్రీధర్ గౌడ్, ఈశ్వర్, ప్రభాకర్, కృష్ణారెడ్డి, శివ పాటిల్, ప్రదిప్ రెడ్డి, జితేందర్ రెడ్డి ,కాలనీ వాసులు పాల్గొన్నారు..

# కార్పోరేషన్ తొలిపీఠం సిపిఐ దే : ఎమ్మెల్యే కూనంనేని

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : సిపిఐ అభ్యర్థులను గెలిపించడం ద్వారా కార్పోరేషన్ సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని, అవినీతి రహిత పాలన కేవలం కమ్యూనిస్టులతోనే చేకూరుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. కార్పోరేషన్ ఎన్నికల్లో భాగంగా ఆదివారం 26,50,54 డివిజన్లలో విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని తో పాటు అభ్యర్థులకు మహిళలు హారతులు పట్టి అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ కూనంనేని మాట్లాడుతూ తనను రెండు సార్లు ఎంఎల్ఎ గా ఆశీర్వదించారని, పెద్ద ఎత్తున అభివృద్ధి నిధులను తెచ్చి ఈ ప్రాంతాభివృద్ధికి పాటుపడుతున్నట్లు తెలిపారు. ప్రతీ గడపకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని చెప్పారు. కమ్యూనిస్టులతో సమగ్రాభివృద్ధి సాధ్యమని, సిపిఐ అభ్యర్థుల గెలుపు ద్వారా కార్పోరేషన్పై



ఎర్రజెండా ఎగురవేద్దామన్నారు. నిత్యం ప్రజలతో ఉండే వారికే ప్రజా సమస్యల పై పట్టు ఉంటుందని, వాటి పరిష్కారానికి పోరాటాలు చేస్తారని, ఓట్లు అడిగేందుకు ఎన్నికల సమయంలో కొందరు వస్తుంటారని, వారు మాయమాటలు చెప్పి ప్రలోబాలకు గురిచేసేందుకు ప్రయత్నిస్తారని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓట్ల కోసం వచ్చే వారు ఎన్నికలు పూర్తయిన తర్వాత మళ్లీ కనిపించరని, సమస్యల కోసం విన్నవించుకుందామన్నా కనీసం ముఖం కూడా చూపించరన్నారు. పదువులున్నా లేకున్నా ప్రజలతో నిత్యం ఉండేది ఎర్రజెండానే అని, ఆ ఎర్రజెండాను కార్పోరేషన్ పై ఎగురవేయడం ద్వారా ప్రజలకు సుపరిపాలన అందుతుందన్నారు. ఎవరు ఎన్ని మాయమాటలు చెప్పినా ప్రజల నుండి ఎర్రజెండాను ఎవ్వరూ దూరం చేయలేరని తెలిపారు. కార్పోరేషన్ కావడం ద్వారా ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ఉద్యోగులకు జీతాలు పెరుగుతాయని, పరిశ్రమలు రావడంతో ఆర్థిక శక్తి మెరుగు పడుతుందని, ఇది ఈ ప్రాంతానికి వరమని చెప్పారు. ఈ ఎన్నికలు అహంకారానికి ఆత్మ గౌరవానికి మధ్య జరగుతున్నాయని, ఎవరు ఎన్ని జిమ్మిక్కులు చేసినా కార్పోరేషన్ పై ఎగిరేది ఎర్రజెండానే అన్నారు. ఈ కార్యక్రమాల్లో అభ్యర్థులు దాసరి శ్రీనివాస్, ఎర్ర లింగేశ్వర్, పల్లపోతు భాగ్యలక్ష్మీ, సిపిఐ నాయకులు కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, మునిగడప వెంకటేశ్వర్లు, భూక్య శ్రీను, గెద్దాడు నగేష్, నేరెళ్ల రమేష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు





## మల్కాజ్ గిరి జీహెచ్ఎంసీ

# జోనల్ ఆఫీస్ నీడలోనే అక్రమ నిర్మాణాల

* **నోటీసులు ఉన్నా ఆగని పనులు!**

మల్కాజ్గిరి, ప్రజాస్ఫూర్తి : మల్కాజ్గిరి మున్సిపల్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తున్న ఈ కట్టడాలపై స్థానికులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా, అధికారులు కేవలం 'నోటీసుల' నాటకంతో కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే......జోనల్ ఆఫీస్ పరిసర ప్రాంతాల్లో పలువురు యజమానులు ఎటువంటి అనుమతులు లేకుండా, లేదా అనుమతి పొందిన ప్లాన్ కు విరుద్ధంగా అదనపు అంతస్తులను నిర్మిస్తున్నారు. ఈ విషయంపై స్థానిక నివాసితులు పదేపదే టౌన్ ప్లానింగ్ అధికారులకు, ఏసీపీ కి ఫిర్యాదులు చేశారు. ఫిర్యాదు చేసిన వెంటనే అధికారులు క్షేత్రస్థాయికి వచ్చి 'నోటీసులు ఇచ్చాం' అని చెబుతున్నారే తప్ప, పనులను మాత్రం ఆపించడం లేదు.

* **అధికారుల ఉదాసీనత - యజమానుల మొండితనం:**

నోటీసులు అందినప్పటికీ, యజమానులు ఏమాత్రం భయం లేకుండా పనులు కొనసాగిస్తుండటం గమనార్హం. "అధికారుల కళ్లముందే అక్రమ కట్టడాలు జరుగుతున్నా పట్టించుకోకపోవడం చూస్తుంటే.. ఇందులో అధికారుల హస్తం ఉందా?" అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ఇరుకైన రోడ్లు, డ్రైనేజీ సమస్యలతో సతమతమవుతున్న మల్కాజ్గిరిలో, ఇలాంటి అక్రమ నిర్మాణాలు పెరిగితే భవిష్యత్తులో మౌలిక సదుపాయాలు పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది.

**హైడ్రా జోక్యం చేసుకోవాలి:**

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం మోపుతున్న 'హైడ్రా' మరియు ఉన్నతాధికారులు మల్కాజ్గిరి జోనల్ ఆఫీస్ పరిసరాల్లో జరుగుతున్న నిర్మాణాలపై విచారణ జరిపించాలని బాధితులు కోరుతున్నారు. నోటీసులకే పరిమితం కాకుండా, తక్షణమే నిర్మాణాలను సీల్ చేసి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# నడిచొచ్చె నజరానా!

* **రాజధాని శివారు పట్టణాల్లో ఇంటింటికీ పంపకాలు**
* **ఓటు తమకేనంటూ ప్రమాణాలు తీసుకుంటున్న అభ్యర్థులు**
* **పగలు ప్రచారం కన్నా.. రాత్రి మంతనాలకే ప్రాధాన్యం**



రంగారెడ్డి జిల్లా : మొయినాబాద్ పురపాలక సంఘంలో ఒక వార్డు అభ్యర్థి.. నలుగురు ఓటర్లున్న కుటుంబాన్ని రాత్రి పూట ఓటు అడిగేందుకు వెళ్లారు. వారికి ఉన్న పాత టీవీ స్థానంలో సరికొత్త ఎల్ఈడీ టీవీ అందించి అందరి కాళ్లు మొక్కి.. తనకే ఓటేయాలని ప్రమాణం చేయించుకున్నారు. ఈ సమాచారం తెలిసిన ప్రత్యర్థి.. సరికొత్త ఫ్రిజ్ తో ఆ ఇంటికి వెళ్లారు. సమాన ధర్మం పాటించాలని నాలుగు ఓట్లలో రెండు తనకే వేయాలంటూ ఒట్టు పెట్టించుకుని మరీ వచ్చారు. ఈనాడు, హైదరాబాద్: పురపాలక ఎన్నికల్లో ప్రచారం తారస్థాయికి చేరింది. పోలింగ్ తేదీ సమీపిస్తుండడంతో అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. పగటివేళ ఇంటింటి ప్రచారం, కరపత్రాల పంపిణీ, డప్పు వాయిద్యాలు.. నృత్యాలతో కోలాహలంగా నిర్వహిస్తున్నారు. రాత్రివేళ సన్నిహితులను వెంటబెట్టుకుని ఇంటింటికీ వెళ్తున్నారు. ఓటర్ల కాళ్లు మొక్కుతూ.. నజరానాలిచ్చి ప్రమాణాలు చేయించుకుంటున్నారు. రాష్ట్ర, జిల్లా నాయకులు, ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రచారానికి వస్తామంటే.. అభ్యర్థులు బెంబేలెత్తుతున్నారు. ఆ ఖర్చుకయ్యే సొమ్మును వార్డులో పంచితే ప్రయోజనం ఉంటుందని భావిస్తున్నారు. రాత్రిపూట ఇంటింటి ప్రచారానికి వెళ్తున్న అభ్యర్థులు అక్కడికక్కడే నగదు, నజరానాలు అందిస్తున్నారు. గృహోపకరణాలు వెంటనే పంపిణీ చేయాలని అనుయాయులను పురమాయిస్తున్నారు. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని పురపాలక సంఘాల్లో ఈ తరహా ప్రచారం జోరుగా సాగుతోంది. నగర శివారుల్లో వచ్చే ఆదాయాన్ని దృష్టిలో పెట్టుకుని ఖర్చుకు సైతం వెనుకాడటం లేదు. రంగారెడ్డి జిల్లాలో చేవెళ్ల, మొయినాబాద్, శంకరపల్లి, షాద్నగర్, ఆమనగల్లు, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలకు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో అలియాబాద్, మూడు చింతలపల్లి, ఎల్లంపేట్, సంగారెడ్డి జిల్లాలో ఇంద్రేశం, ఇస్నాపూర్ పట్టణాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో స్థిరాస్తి రంగం ప్రభావం ఎన్నికలపై తీవ్రంగా ఉంది. శంకరపల్లిలో రాత్రి ప్రచారానికి తెరతీసిన అభ్యర్థులు అప్పటికప్పుడు టోకెన్గా రూ.5 వేల చొప్పున పంపిణీ చేశారు. మళ్లీ ఇస్తామంటూ భరోసా ఇచ్చి ప్రమాణం తీసుకున్నారు. శంకరపల్లి మున్సిపాలిటీ జనరల్కు రిజర్వు అయింది. గెలిస్తే.. తానే ఛైర్మన్ అని భావించే ఓ అభ్యర్థి చీరెలు, మిక్సీలతో పాటు నగదు పంచిపెట్టారు. శంకరపల్లిలో ఈసారి తమనే గెలిపించాలంటూ ఓ పార్టీ అభ్యర్థులు నగదు పంచుతూ కాళ్లు మొక్కుతున్నారు. ఈ పట్టణంలో ఒక పార్టీ తరఫున రెండు వర్గాల అభ్యర్థులు పోటీ పడుతూ.. యథేచ్ఛగా పంపకాలు సాగిస్తున్నారు. ఇక్కడ 15 వార్డులు మాత్రమే ఉన్నాయి. షాద్నగర్లో పోటీ చేస్తున్న ఒక అభ్యర్థి.. ఓ ప్రాంతంలో గతంలో రోడ్డు నిర్మాణం చేయించాలంటే ముఖం చాటేశారు. దీంతో అక్కడ వ్యతిరేకత ఉందని గ్రహించిన నాయకుడు రాత్రికి రాత్రి సీన్ మార్చేశారు. ఆ వీధిలో ఉండే కుటుంబాలతో మంతనాలు చేసి రూ.లక్షలు నజరానాగా అందజేశారు. ఇదే పురపాలక సంఘంలో ఒక వర్గంలో పలుకుబడి ఉన్న యువకుడు చెబితే ఓట్లు పడతాయన్న అంచనాతో.. అతడికి రాత్రికి రాత్రే కండువా కప్పేశారు. మొయినాబాద్లోని సురంగల్లో ప్రతి ఇంటిలోనూ కొత్త టీవీలు, ఫ్రిజ్లే దర్శనమిస్తున్నాయి. కొంతమందికి వాషింగ్మెషిన్లు సరఫరా చేశారు. ఆమనగల్లులో ప్రధాన పార్టీల మధ్య పోటీ ఉంది. ఇక్కడ ముక్కోణపు పోటీ నెలకొనడంతో రాత్రి మంతనాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఒక వార్డులో 1200 వరకు ఓట్లుంటే.. దాదాపు 600 మందికి నజరానాలు అందించాయి. ఇబ్రహీంపట్నం, ఇంద్రేశం, ఇస్నాపూర్లోనూ ఇదే తంతు సాగుతోంది. పక్క పార్టీకి చెందిన వారైనా సరే నజరానాలు ఇచ్చి తమ వైపు తిప్పుకొంటున్నారు. ఈ వ్యవహారంలో సామాజికవర్గం, రక్తసంబంధం, స్నేహం వంటి కార్డులను ఉపయోగిస్తున్నారు. ఓటర్లకు భారీ నజరానాలు పంచే అభ్యర్థులు ఓడిపోతే.. వాటిని తిరిగి ఇమ్మంటారనే భయం ఓటర్లను వెంటాడుతోంది. అలా అడగవద్దని కొందరు ఓటర్లు ముందుగా భరోసా తీసుకుంటున్నారు.



# శ్రీలక్ష్మి నరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో రావి మొక్క నాటిన రేవంత్

సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం మున్సిపల్ ఎన్నికల ప్రచారం కోసం భూపాలపల్లి జిల్లాలో పర్యటించారు. ఈసందర్భంగా జిల్లాలోని రేగొండ మండలం కొడవటంచ గ్రామంలో ఉన్న శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. రూ.12.15 కోట్ల నిధులతో ఆలయ పునఃప్రతిష్ఠాపన పనులకు శంకుస్థాపన చేశారు. రూ.74.15 కోట్లతో అతిథి గృహాలు, అంతర్గత రోడ్లను ప్రారంభించి అనంతరం ఆలయ ప్రాంగణంలో సీఎం రావి మొక్కను నాటారు. ఈసందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కొడవటంచ గ్రామాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంతో పాటు రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిల్ల శ్రీధర్ బాబు, కొండా సురేఖ, స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, తదితరులు పాల్గొన్నారు.











# పాలిటెక్నిక్‌లో 10 కొత్త కోర్సులు..! మొత్తం సీట్లు 18,300..!!

హైదరాబాద్ : మీరు పదో తరగతి తర్వాత పాలిటెక్నిక్ కోర్సులు చేయాలనుకుంటున్నారా..? ఇంజినీరింగ్, టెక్నాలజీ కోర్సులు చేసి ఉన్నతంగా స్థిరపడాలనుకుంటున్నారా..? అయితే తెలంగాణ స్టేట్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ బోర్డు మీలాంటి విద్యార్థుల కోసం సువర్ణావకాశాన్ని కల్పిస్తుంది. 202627 విద్యాసంవత్సరానికి గానూ 10 కొత్త కోర్సులను ప్రవేశపెడుతుంది. ఈ కొత్త కోర్సుల వివరాలు తెలుసుకుందాం.

**కొత్త కోర్సులు ఇవే..**

సెమీ కండక్టర్ టెక్నాలజీ, అడ్వాన్స్డ్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నాలజీ, ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజినీరింగ్, ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్, బయో టెక్నాలజీ, సివిల్ ఇంజినీరింగ్ (బిల్డింగ్ సర్వీసెస్ ఇంజినీరింగ్), సివిల్ ఇంఇజీనిరింగ్, రియల్ ఎస్టేట్ అండ్ వాల్యూయేషన్, కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, ఇంటీరియర్ డిజైన్ అండ్ ల్యాండ్‌స్కేప్ డిజైన్ వంటి కోర్సులను కొత్తగా ప్రవేశపెడుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాల సంఖ్యను పెంచడంతో పాటు.. విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన కోర్సులను అందించాలనే ఉద్దేశంతోనే కొత్త కోర్సులను ప్రవేశపెట్టేందుకు బోర్డు నిర్ణయించిందని బోర్డు సెక్రటరీ ఏ పుల్లయ్య పేర్కొన్నారు. గ్రామీణ విద్యార్థులు ఈ సువర్ణ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

**కొత్త కోర్సుల్లో సీట్లు 2280**

కొత్త కోర్సుల్లో మొత్తం సీట్లు 2,280 ఉండగా.. ఇందులో సెమీకండక్టర్ టెక్నాలజీలో 720, ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్‌లో 480, అడ్వాన్స్డ్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నాలజీలో 240 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కోర్సులను మొదటగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లోనే ప్రవేశపెడుతామన్నారు.

**మొత్తం సీట్లు - 18,300**

202526 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో మొత్తం 13,050 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ విద్యాసంవత్సరానికి కొత్తగా ప్రవేశపెట్టబోయే కోర్సుల్లో 2,880 సీట్లు అందుబాటులోకి రానున్నాయి. ఇక మొత్తంగా 202627 విద్యాసంవత్సరానికి మొత్తం 18,300 సీట్లు అందుబాటులోకి రానున్నాయని సెక్రటరీ పేర్కొన్నారు.

# సాగర్ కాలువలోకి దూసుకెళ్లిన కారు.. దంపతులు గల్లంతు

నల్లగొండ: నిడమనూరు మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మండలంలోని ముకుందాపురంలో సాగర్ ఎడమ కాలువలోకి కారు దూసుకెళ్లింది. శనివారం రాత్రి 11 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కారులో ప్రయాణిస్తున్న పుల్లయ్య, పద్మ దంపతులు గల్లంతయ్యారు. వారిని త్రిపురారం మండలం కంపాసాగర్‌కు చెందిన వారిగా గుర్తించారు. గల్లంతయినవారి కోసం రాత్రి గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం ఉదయమూ గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.



# సిద్ధిపేట జిల్లాలో పెద్దపులి కలకలం... వరుసగా పశువులపై దాడులు!

* **సిద్దిపేట జిల్లాలో పశువులపై పులి దాడులు**
* **తాజాగా ఐదు దూడలను చంపివేయడంతో భయాందోళనలు**
* **పులిని పట్టుకునేందుకు అటవీ శాఖ ముమ్మర యత్నాలు**
* **పొలాలకు ఒంటరిగా వెళ్లొద్దని ప్రజలకు హెచ్చరిక**
* **ఈ పులి మహారాష్ట్ర నుంచి వచ్చినట్లు అధికారుల అనుమానం**

తెలంగాణ: సిద్ధిపేట జిల్లాలో ఓ పెద్దపులి సృష్టిస్తున్న భయాందోళనలు కొనసాగుతున్నాయి. వరుసగా పశువులపై దాడి చేస్తూ వాటిని చంపుతుండటంతో స్థానిక గ్రామాల్లో తీవ్ర కలకలం రేగింది. ఈ పులిని పట్టుకునేందుకు అటవీ శాఖ అధికారులు తమ ఆపరేషన్‌ను ముమ్మరం చేశారు. తాజాగా కొహెడ మండలం ఆరెపల్లి గ్రామంలో పులి సంచరించినట్లు కొంతమంది రైతులు చెప్పడంతో గ్రామస్థులు భయంతో వణికిపోతున్నారు. సమీపంలోని చంద్రానాయక్ తండా వద్ద మాలోత్ రమేష్ అనే రైతుకు



చెందిన ఐదు దూడలను పులి చంపేసింది.

స్థానికుల సమాచారంతో అటవీ, పోలీస్ శాఖ అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పులి పాదముద్రలను సేకరించారు. పులి సంచరిస్తున్న ప్రదేశాల్లో కెమెరా ట్రాప్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ప్రజలకు కీలక సూచనలు జారీ చేశారు. రైతులు తమ పశువులను పొలాల్లో కాకుండా ఇళ్ల వద్దే సురక్షితంగా కట్టేసుకోవాలని సూచించారు. అలాగే, పొలాలకు ఒంటరిగా వెళ్లవద్దని, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, పిల్లలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈ పులి గతంలో జిల్లాలోని ఘనపూర్, అక్కెనపల్లి, బస్వాపురం గ్రామాల్లోనూ పశువులపై దాడి చేసి చంపేసింది. శనివారం జనగామ జిల్లాలోని కొన్ని గ్రామాల్లో పశువులను చంపిన తర్వాతే ఇది సిద్ధిపేట జిల్లాలోకి ప్రవేశించి ఉంటుందని అధికారులు తెలిపారు. పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి ఈ పులి తెలంగాణలోకి వచ్చినట్లు అనుమానిస్తున్నారు. వారం రోజుల వ్యవధిలోనే తెలుగు రాష్ట్రాల్లో ఇది రెండో ఘటన. ఫిబ్రవరి 6న ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి సమీపంలో సంచరించిన ఓ పులిని అటవీ అధికారులు విజయవంతంగా పట్టుకున్న విషయం తెలిసిందే.

## 'రుద్ర' పుస్తకాన్ని ఆవిష్కరించిన చిరంజీవి... కృతజ్ఞతలు తెలిపిన కొండా సురేఖ

* **'రుద్ర' పుస్తకాన్ని రచించిన మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత**
* **పుస్తకాన్ని ఆవిష్కరించిన మెగాస్టార్ చిరంజీవి**
* **శివపురాణంపై యువతకు అవగాహన కల్పించడమే ఈ పుస్తక లక్ష్యం**
* **రచయిత్రి ప్రయత్నాన్ని అభినందించిన చిరంజీవి, కృతజ్ఞతలు తెలిపిన మంత్రి సురేఖ**
* **సోషల్ మీడియా ద్వారా పుస్తకావిష్కరణ వివరాలు వెల్లడి**



హైదరాబాద్ : టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి 'రుద్ర' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత పటేల్ ఈ పుస్తకాన్ని రచించారు. ఈ పుస్తకావిష్కరణ విషయాన్ని మంత్రి కొండా సురేఖ తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ, ఆధ్యాత్మిక విలువలు, సాంస్కృతిక వారసత్వాన్ని యువతకు చేరువ చేసేలా ఈ పుస్తకాన్ని రూపొందించడం సంతోషంగా ఉందన్నారు. నేటి తరానికి ఇటువంటి విలువైన పుస్తకాలు ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. రచయిత్రి సుస్మిత పటేల్ ప్రయత్నాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. పుస్తకావిష్కరణకు అంగీకరించిన మెగాస్టార్ చిరంజీవికి మంత్రి కొండా సురేఖ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. "నేటి యువతకు ఆదర్శంగా నిలిచేలా, శివ పురాణంపై అవగాహన కలిగించాలనే ఉన్నత లక్ష్యంతో ఈ పుస్తకాన్ని రచించిన కొండా సుస్మితకు హృదయపూర్వక శుభాకాంక్షలు. భవిష్యత్తులో కూడా ఇలాంటి మరిన్ని గొప్ప రచనలు చేయాలని ఆకాంక్షిస్తున్నాం" అని ఆమె తన పోస్టులో పేర్కొన్నారు. యువతను లక్ష్యంగా చేసుకుని, శివపురాణంలోని విశేషాలను వారికి సులభంగా తెలియజేయాలనే సంకల్పంతో ఈ పుస్తకాన్ని రచించినట్లు తెలుస్తోంది.

## ఫోరెన్సిక్ ల్యాబ్ ఘటనపై జ్యుడీషియల్ విచారణ జరపాలి

**: కేటీఆర్ డిమాండ్**

* **ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్నిప్రమాదం సీఎం రేవంత్ రెడ్డి పన్నిన కుట్రేనని కేటీఆర్ ఆరోపణ**
* **'ఓటుకు నోటు' కేసు సాక్ష్యాలను నాశనం చేసేందుకే ఈ ఘటన అన్నారు**
* **ప్రమాదంపై రిటైర్డ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్**
* **వేలాది క్రిమినల్ కేసులకు సంబంధించిన కీలక ఆధారాలు కాలిపోయాయని ఆందోళన**

హైదరాబాద్ : హైదరాబాద్‌లోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీలో (ఎఫ్ఎస్ఎల్) శనివారం జరిగిన అగ్నిప్రమాదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. 'ఓటుకు నోటు' కేసుకు సంబంధించిన కీలక సాక్ష్యాలను ధ్వంసం చేసేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కుట్ర పన్నారని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ ప్రాయోజిత ఘటనే అని ఆయన ఆరోపించారు. ఈ ఘటనపై తక్షణమే



న్యాయ విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం నాడు హనుమకొండలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 'ఓటుకు నోటు' కేసు తుది తీర్పు దశకు చేరుకున్న సమయంలో, సాక్ష్యాలను శాశ్వతంగా నాశనం చేయాలనే దురుద్దేశంతోనే ఈ ప్రమాదాన్ని సృష్టించారని అన్నారు. అత్యంత భద్రత ఉండే ల్యాబ్‌లో, అదీ శీతాకాలంలో మంటలు చెలరేగడం, 24 గంటలూ సిబ్బంది ఉండాల్సిన చోట ఎవరూ లేకపోవడం వంటివి అనేక అనుమానాలకు తావిస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. "ప్రారంభంలో స్వల్ప నష్టమే జరిగిందని అధికారులు చెప్పారు. కానీ ఆ తర్వాత 2015 నుంచి పదేళ్ల విలువైన సాక్ష్యాధారాలు పూర్తిగా కాలిపోయాయని ఎఫ్ఐఆర్‌లో పేర్కొనడం కుట్ర అనే అనుమానాన్ని బలపరుస్తోంది" అని కేటీఆర్ వివరించారు. కేవలం ఒక అంతస్తుకు పరిమితమైన మంటలను ఆర్పేందుకు మూడున్నర గంటలకు పైగా సమయం ఎందుకు పట్టిందని ఆయన ప్రశ్నించారు. ఈ ఘటనలో దాదాపు 50 కంప్యూటర్లు, సర్వర్లు, డిజిటల్ రికార్డులు కాలిపోయాయని ఆరోపించారు. ఈ ప్రమాదంలో వేలాది తీవ్రమైన క్రిమినల్ కేసులకు సంబంధించిన ఆధారాలు కూడా ధ్వంసమయ్యాయని, ఇది ప్రజా భద్రతకు పెను ముప్పు అని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీ పెద్దల అండతోనే ముఖ్యమంత్రి ఇదంతా చేస్తున్నారని ఆరోపిస్తూ, దీనిపై కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర పోలీసులపై నమ్మకం లేదని, వారు సీఎంకు ప్రైవేట్ సైన్యంలా పనిచేస్తున్నారని విమర్శించారు. ఘటనపై రిటైర్డ్ జడ్జితో న్యాయ విచారణ జరపాలని, అఖిలపక్ష బృందాన్ని ఎఫ్ఎస్ఎల్ ప్రాంగణాన్ని సందర్శించేందుకు అనుమతించాలని కోరారు.



## వంద కోట్ల భూమిని కాపాడిన హైడ్రా.. ఎక్కడంటే!

* **అమీన్ పూర్ లోని చక్రపురి లేఔట్ లో అక్రమాలు**
* **రోడ్లు, పార్కు స్థలాల ఆక్రమణ.. బుల్డోజర్లతో హైడ్రా తొలగింపు**
* **స్థానికుల ఫిర్యాదుతో చర్యలు**

హైదరాబాద్ : ప్రభుత్వ స్థలాల ఆక్రమణదారులపై ఉక్కుపాదం మోపుతున్న హైడ్రా అధికారులు తాజాగా వంద కోట్ల విలువైన నాలుగు ఎకరాల స్థలాన్ని కాపాడారు. ఆక్రమణలు కూల్చివేసి కబ్జాదారుల చెర నుంచి విలువైన భూమిని విడిపించారు. అమీన్ పూర్ లోని చక్రపురి లేఔట్ లో రోడ్లు, పార్కు స్థలం కబ్జాకు గురైందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో హైడ్రా అధికారులు రంగంలోకి దిగారు. ఈరోజు ఉదయం బుల్డోజర్లతో అమీన్ పూర్ చేరుకున్న అధికారులు.. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కట్టిన నిర్మాణాలను కూల్చివేశారు. పోలీస్ సిబ్బంది బందోబస్తుతో రెవెన్యూ అధికారుల సమక్షంలో హైడ్రా అధికారులు మొత్తం 15 జేసీబీలతో ఆక్రమణలు తొలగించారు. దీంతో పాటు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దూలపల్లి విలేజ్‌లోని సుమారుకుంటలో, నాగారం రామకృష్ణ నగర్ కాలనీలోని శివాలయానికి చెందిన 1,365 గజాల స్థలాన్ని, యూసుఫ్గూడలో మూడున్నర ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా హైడ్రా కాపాడింది.

## తెలంగాణలో మద్యం దుకాణాలు బంద్

హైదరాబాద్: తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అన్ని మున్సిపాలిటీలలో 9వ తేదీ సాయంత్రం 5 గంటల నుండి 11వ తేదీ వరకు మద్యం దుకాణాలు మూతపడనున్నాయి. అదేవిధంగా ఫలితాల నేపథ్యంలో 13వ తేదీన కూడా వైన్స్, బార్లు బంద్ ఉండనున్నాయి. ఎక్సైజ్ శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉంటే.. ఈ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సమీపిస్తుండడంతో ఆయా మునిసిపాలిటీలలో ప్రచారం ఊపందుకుంది. ప్రచారానికి రేపు ఒక్కరోజు మాత్రమే గడువు ఉండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు సర్వశక్తులూ



ఒడ్డుతున్నారు. కరపత్రాలు తయారు చేసుకొని ఇంటింటికీ తిరుగుతూ ఓటు వేయాల్సిందిగా ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. కొందరు అభ్యర్థులైతే ఏకంగా ఓటర్ల కాళ్లకు మొక్కుతూ ఓటు వేయాలని వేడుకుంటున్నారు. ఒకసారి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## మేడారంలో హుండీల్లో 18 దేశాల కరెన్సీ

ములుగు : మేడారం మహాజాతర హుండీల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఆదివారం నాలుగో రోజు లెక్కింపు పూర్తయింది. ఇప్పటివరకు 615 హుండీల్లో రూ.10.71 కోట్ల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. మొత్తం 18 దేశాలకు చెందిన విదేశీ కరెన్సీ లభ్యం అయినట్లు వెల్లడించారు. ఇక మేడారం జాతర హుండీల ద్వారా వచ్చిన మొత్తం ఆదాయంలో 33 శాతం వాటాను పూజారులకు అందిస్తారు. గత జాతరలో సుమారు రూ.13 కోట్ల ఆదాయం వచ్చింది. అయితే ఈసారి దాని కంటే 3 రెట్లు అధిక ఆదాయం వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక మొత్తం లెక్కింపుకు దాదాపు 10 రోజులకు పైనే సమయం పట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. లెక్కింపు పూర్తయ్యాకే మొత్తం ఆదాయం ఎంత వచ్చిందో అధికారికంగా ప్రకటించనున్నారు. మొత్తం మేడారంలో 828 హుండీలు ఏర్పాటు చేశారు. ఇందులో 780 ఇనుప హుండీలు, 45 వస్త్ర హుండీలు, 3 బియ్యం హుండీలు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన మేడారం



సమ్మక్క సారలమ్మ మహాజాతర జనవరి 28 నుంచి 31 వరకు జరిగింది. ఈ జాతరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు పలు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు హాజరయ్యారు.

## యూరియా యాప్‌పై బీఆర్ఎస్ బూటకపు ప్రచారం

**: మంత్రి తుమ్మల కీలక వ్యాఖ్యలు**

హైదరాబాద్: రాష్ట్రంలో యూరియా కోసం రైతులు క్యూలైన్ లో ఉన్నారని ప్రతి పక్ష బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారం అబద్ధమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కొట్టి పారేశారు. గత పదేళ్ళలో వారి ప్రభుత్వం ఏ విధంగా రైతులను గోస పెట్టిందో రైతాంగానికి తెలుసనే సంగతి మరిచి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంటూ, తాము అధికారం చేపట్టిన ఈ రెండు సంవత్సరాలలో వ్యవసాయ రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. సిద్దిపేట, గజ్వేల్ లో ఎరువుల కోసం క్యూ లైన్ లతో పాటు రైతులు మరణించిన సందర్భాలు మరిచిపోయి రాష్ట్రంలో ఒకటి రెండు చోట్ల సాంకేతిక సమస్యలతో ఏర్పడిన రద్దీని కూడా రాజకీయంగా వాడుకొనే పరిస్థితికి ఆ పార్టీ దిగజారిందన్నారు. రైతులు కొనుగోలు చేయకుండానే 7.60 లక్షల టన్నులు యూరియా ఈ యాసంగిలో ఏవిధంగా అమ్మకం జరిగిందో తెలుసుకోవాలని, వరి బోనస్ గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదన్నారు. గత వానాకాలం కేంద్ర నుండి తగిన సమయంలో ఎరువులు అందక కొన్ని రోజులు పడిన



ఇబ్బందులును రాజకీయ లబ్ధి కోసం ప్రతిపక్షం వాడుకుంటే పంచాయతీ ఎన్నికల్లో రైతులు కర్రు కాల్చి వాత పెట్టారన్నారు.

* **8.42 లక్షల మెట్రిక్ టన్నులు సరాఫరా..**

యూరియా యాసంగికి 10.40 లక్షల మెట్రిక్ టన్నులు అవసరముంటే ఇప్పటికే 8.42 లక్షల మెట్రిక్ టన్నులు సరాఫరా జరిగిందని, 7.60 లక్షల మెట్రిక్ టన్నులు రైతులకు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఈ వానాకాలం పత్తి రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కిసాన్ యాప్ విజయవంతం కావడంతో, అదే ప్రాతిపదికన యూరియా యాప్ ను తీసుకువచ్చి పరిశీలిస్తుంటే బీఆర్ఎస్ నాయకులకు వచ్చిన ఇబ్బంది ఏంటో చెప్పాలన్నారు. యాప్ అమలులో ఉన్న జిల్లాల రైతులను అడిగి తెలుకుంటే బాగుంటుందన్నారు. మిగతా అన్ని జిల్లాల్లో రైతులకు అవసరం మేరకు యూరియా బస్తాలు సరఫరా చేస్తూ ఉంటే, తిరిగి రైతులలో ఆందోళన సృష్టించడానికి రోజుకొకరు యూరియా అని, యాప్ అని, మాట్లాడుతుంటే రైతులు నవ్వుకుంటున్నారన్నారు.. యాప్ ద్వారా 22 జిల్లాల రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇప్పటికే 2.64 కోట్ల బస్తాల యూరియాను కొనుగోలు చేశారు.. గత ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేసిన వారు కూడా రైతుల సౌకర్యార్థం ఒక యాప్ తీసుకొస్తే ఊరూరా తిరిగి లేని పోని అపోహలు సృష్టించినా రైతులు వారిని నమ్మ లేదన్నారు. ప్రాసలతో కల్లబొల్లి మాటలు చెప్పినా రైతులు నమ్మరనే విషయాన్ని బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికీ గ్రహించినట్లు లేదన్నారు. ఈ ప్రభుత్వం మీద రైతులకు పూర్తి నమ్మకముందని రైతు భరోసా , రైతు బీమా , పంట కొనుగోళ్లు, బోనస్, పంట నష్ట పరిహారం, యాంత్రీకరణ పథకాలతో మా చిత్తశుద్ధి నిరూపించుకున్నామన్నారు.

## ఇండియా VS పాకిస్తాన్ మధ్య కబడ్డీ మొదలైంది: బండి సంజయ్

హైదరాబాద్ : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆదివారం కరీంనగర్‌లో ఆయన మాట్లాడుతూ.. కరీంనగర్‌లో కబడ్డీ ఆట మొదలైందని చెప్పారు. ఇండియా పేరుతో బీజేపీ, పాకిస్తాన్ పేరుతో ఎంఐఎం/కాంగ్రెస్ పార్టీల మధ్య మ్యాచ్ ఉండబోతోందని కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్, ఎంఐఎం మధ్య రూ.100 కోట్ల డీల్ (మ్యాచ్ ఫిక్సింగ్) కుదిరిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ డబ్బుతో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు. కరీంనగర్‌లోని మీడియా, సోషల్



మీడియాసహా యువకులంతా కుల, మతాలకు అతీతంగా ఒక్కటై కాంగ్రెస్, ఎంఐఎం చేస్తున్న కుట్రలను వివరించాలని పిలుపునిచ్చారు. 'కరీంనగర్‌కు రక్షణ కవచంగా నేనుంటా. కరీంనగర్‌లో కాంగ్రెస్, ఎంఐఎం కుట్రలకు తగిన బుద్ధి చెప్పండి' అని బండి కోరారు.

# రిటైర్మెంట్‌పై ఆరెస్సెస్ చీఫ్ భాగవత్ కీలక వ్యాఖ్యలు



తన రిటైర్మెంట్‌పై ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ కీలక వ్యాఖ్యలు చేశారు. వయసుతో సంబంధం లేకుండా పనిని కొనసాగించాలని సంఘ్ తనను కోరిందన్నారు. ఒకవేళ దిగిపోవాలని ఆదేశిస్తే.. వైదొలగేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ముంబయిలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ మేరకు మాట్లాడారు. ఆరెస్సెస్ చరిత్రలో ఇంతవరకు ఎవరినైనా పదవీ విరమణ చేయించాల్సిన పరిస్థితి రాలేదన్నారు. ''ఆరెస్సెస్ చీఫ్ పదవికి ఎన్నికలు ఉండవు. రీజినల్, డివిజనల్ అధిపతులు సర్‌సంఘ్‌చాలక్‌ను నియమిస్తారు. సాధారణంగా 75 ఏళ్లు నిండిన తర్వాత ఎలాంటి పదవిలో లేకుండా పని చేయాలంటారు. నాకు 75 ఏళ్లు నిండాయి. ఈ విషయాన్ని సంఘ్‌కు తెలియజేశాను. కానీ.. యథావిధిగా కొనసాగాలని కోరింది. పదవి నుంచి వైదొలగాలని ఎప్పుడు కోరినా.. సిద్ధంగా ఉన్నాను. కానీ, పని నుంచి మాత్రం ఎప్పటికీ విరమణ ఉండదు'' అని భాగవత్ చెప్పారు. చివరి రక్తపు బొట్టు వరకు స్వయంసేవకుల నుంచి సంఘ్ పని చేయించుకుంటుందని సరదాగా వ్యాఖ్యానించారు. వీర్ సావర్కర్‌కు భారతరత్న పురస్కారం ఇస్తే దాని ప్రతిష్ఠ పెరుగుతుందని భాగవత్ అన్నారు. దేశ ప్రయోజనాలకు నష్టం వాటిల్లకుండా భారత్ అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరినట్లు భావిస్తున్నానని చెప్పారు. అన్ని వర్గాలను పరిగణనలోకి తీసుకొని 'ఉమ్మడి పౌరస్మృతి' రూపొందించాలని, అది విభేదాలకు దారితీయకూడదని పేర్కొన్నారు. ప్రచారం చేయడం సంఘ్ పని కాదని, సంస్కారాలను పెంపొందించడమేనని తెలిపారు.

## మహిళ కంపార్ట్‌మెంట్‌లో ఆగంతుకుడు




ముంబయిలో ఓ అనూహ్య ఘటన చోటుచేసుకుంది. రద్దీగా ఉండే లోకల్ ట్రైన్‌లో ఓ ఆగంతుకుడు బురఖా ధరించి మహిళ కంపార్ట్‌మెంట్‌లోకి చొరబడటం కలకలం రేపింది. నిందితుడి అసాధారణ ప్రవర్తనతో మహిళ ప్రయాణికులు వెంటనే అప్రమత్తమయ్యారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. అసలు ఏం జరిగిందంటే.. ఘట్కోపర్ స్టేషన్ మీదుగా ప్రయాణిస్తున్న లోకల్ ట్రైన్‌లో మహిళ కంపార్ట్‌మెంట్‌లోకి బురఖా ధరించిన వ్యక్తి ఎక్కాడు. అతడి ప్రవర్తనపై ప్రయాణికులకు అనుమానం వచ్చింది. నిందితుడిని చుట్టుముట్టి నిలదీశారు. మారువేషంలో వచ్చినది పురుషుడని తెలియగానే వెంటనే రైల్వే అధికారులకు సమాచారం ఇచ్చారు. తర్వాతి స్టేషన్‌కు చేరకముందే నిందితుడు ఆ రైలు నుంచి దూకి మరో ట్రైన్ ఎక్కి పారిపోయాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నారు. దొంగతనం చేయడానికి మారువేషంలో వచ్చి ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు.

## స్వదేశానికి బయలుదేరిన ప్రధాని మోదీ



మలేసియాలో రెండు రోజుల పర్యటనను ముగించుకొని ప్రధాని మోదీ భారత్‌కు బయలుదేరారు. ఈ విషయాన్ని విదేశాంగ శాఖ 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. ''మలేసియాలో ప్రధాని మోదీ పర్యటన విజయవంతమైంది. ఆ దేశం మోదీకి ఘన స్వాగతం పలికి ప్రత్యేక ఆతిథ్యాన్ని అందించింది. ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతంగా మారాయి'' అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు. కాగా, ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో అద్భుతమైన సమావేశం జరిగిందని మోదీ 'ఎక్స్'వేదికగా కొనియాడారు. తమ స్నేహపూర్వక బంధాన్ని పొరుగుదేశాలు ఎప్పటికీ ఆస్వాదిస్తాయన్నారు. వాణిజ్యం, రక్షణ సహా పలు సెక్టార్‌లో సహకారం అందించుకోవాలని ఇరుదేశాలు బలంగా నిశ్చయించుకున్నాయని తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ సీఈఓ ఫోరమ్‌తో భేటీ అయ్యారు. ఈ భేటీ ఇరు దేశాల మధ్య వాణిజ్య పెట్టుబడులకు కొత్త పుంతలు తొక్కనుందని మోదీ తెలిపారు. రక్షణ, జాతీయ భద్రత, సెమీకండక్టర్లు, వాణిజ్యం, ఏఐ, వృత్తి విద్య, ఐటీ, డిజిటల్ టెక్నాలజీ సహా మరిన్ని అంశాలపై ఇరు దేశ నాయకులు పలు చర్చలు జరిపారు.

## భారీ ట్రక్కుతో హైవేపై విన్యాసాలు.. డ్రైవర్ అరెస్ట్



హరియాణాలో జాతీయ రహదారిపై ఇటీవల అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ప్రమాదకర రీతిలో ఓ ట్రక్కు డ్రైవర్ విన్యాసాలు చేయడం.. వాహనదారులను భయాందోళనకు గురిచేసింది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో అధికారులు చర్యలు చేపట్టారు. ట్రక్కును సీజ్ చేసి డ్రైవర్‌ను అరెస్టు చేశారు. హరియాణాలోని నూహ్ జిల్లాలో ఢిల్లీముంబయి ఎక్స్‌ప్రెస్‌వే పై ఈనెల 3న ఈ ఘటన చోటుచేసుకుంది. రిగాడ్ గ్రామానికి చేరుకున్న సమయంలో ట్రక్కును వేగంగా నడిపిన డ్రైవర్.. స్టంట్లు చేస్తూ తోటి ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన గురుగ్రామ్ పోలీసులు.. రాజస్థాన్‌కు చెందిన డ్రైవర్‌ను అరెస్టు చేశారు.

## డెడ్‌లైన్ సమీపిస్తున్న వేళ..
## 'నక్సలిజం'పై అమిత్ షా కీలక భేటీ




ఈ ఏడాది మార్చి 31 నాటికి దేశంలో నక్సలిజాన్ని తుడిచిపెడతామని కేంద్రం ప్రకటిస్తూ వస్తోంది. ఈ డెడ్‌లైన్ సమీపిస్తున్న వేళ.. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పుర్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలను సమీక్షించారు. వామపక్ష తీవ్రవాదంపై పోరాటంలో భాగంగా చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయని 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ''భద్రతా వ్యూహాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, మావోయిస్టుల ఆర్థిక నెట్‌వర్క్‌లను దెబ్బతీయడం, లొంగుబాటు పాలసీల వంటివి నక్సలిజంపై పోరాటంలో సత్ఫలితాలు ఇచ్చాయి'' అని అమిత్ షా తెలిపారు. నిర్దేశించుకున్న గడువులోపు నక్సలిజాన్ని నిర్మూలిస్తామని పునరుద్ఘాటించారు. ఈ సమావేశంలో ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఒడిశా, మహారాష్ట్ర, ఝార్ఖండ్ రాష్ట్రాల అధికారులు, కేంద్ర సంస్థలు, భద్రతాబలగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మావోయిస్టులపై కేంద్రం కొన్నేళ్లుగా ఉక్కుపాదం మోపుతోంది. నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలు తీవ్రతరం చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గతేడాది జనవరి నుంచి ఛత్తీస్‌గఢ్‌లో ఆయా ఎన్‌కౌంటర్‌లలో నంబాల కేశవరావు వంటి అగ్ర నేతలు సహా 500 మందికిపైగా మావోయిస్టులు హతమయ్యారు. అదే వ్యవధిలో రాష్ట్రంలో దాదాపు 1,900 మంది నక్సలైట్లు అరెస్టయ్యారు. 2,500 మందికి పైగా లొంగిపోయారు.

## జేఈఈ మెయిన్ ప్రొవిజనల్ కీలో 17 తప్పులా..?




జేఈఈ మెయిన్ 2026 సీజన్ 1 తాత్కాలిక ఆన్సర్‌కీపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తున్నాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) విడుదల చేసిన కీపై ది కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సీఎఫ్ఐ) స్పందిస్తూ ఆన్సర్ కీలో చాలా తప్పులు ఉన్నాయని పేర్కొంది. ఈ తప్పులు విద్యార్థుల ర్యాంకులపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో పలు వివాదాస్పద ప్రశ్నలకుగాను విద్యార్థులకు బోనస్ మార్కులు ఇవ్వాలని సీఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఫిబ్రవరి 4న ప్రొవిజనల్ కీని విడుదల చేయగా.. 6 వరకు అభ్యంతరాల స్వీకరణకు గడువు ఇచ్చారు. ఈ క్రమంలో సీఎఫ్ఐ మొత్తం 17 ప్రశ్నల్లో లోపాలను ఎత్తిచూపింది. స్పష్టత లేని వాక్యాలు, గణించడంలో తప్పులు, తప్పుడు ఆప్షన్లు, ఒకటి కంటే ఎక్కువ సరైన సమాధానాలు ఉన్న ప్రశ్నలు వచ్చాయని పేర్కొంది. వీటిల్లోని 10 ప్రశ్నలు ప్రాథమికంగానే లోపభూయిష్టంగా ఉన్నట్లు వెల్లడించింది.

## శత్రు ఉపగ్రహాలపై నిఘా..! భారత్ కీలక పురోగతి



భారత అంతరిక్ష పరిశోధనల్లో (Space exploration) ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యం ఇటీవల పెరుగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అజిస్టా ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కీలక మైలురాయి సాధించింది. తమ ఉపగ్రహం నుంచి కక్ష్యలోని వస్తువులను చిత్రీకరించే స్వదేశీ సాంకేతికతను విజయవంతంగా పరీక్షించింది. దీంతో ఉపగ్రహాలపై నిఘా ఉంచే సామర్థ్యాన్ని (Orbit Snoop ing) భారత్ ప్రైవేటు రంగం సొంతం చేసుకున్నట్లయ్యింది. 80 కిలోల భూ పరిశీలన ఉపగ్రహం ఏఎఫ్‌ఆర్ (AFR)ను ఫాల్కన్ 9 ద్వారా అజిస్టా రెండున్నరేళ్ల క్రితం కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ప్రస్తుతం విజయవంతంగా పనిచేస్తోన్న ఈ శాటిలైట్ మరో రెండున్నరేళ్లు సేవలు అందించగలదు. ఈ క్రమంలో పరిశోధనల్లో భాగంగా ఏఎఫ్‌ఆర్ సాయంతో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని (ISS) అజిస్టా విజయవంతంగా చిత్రీకరించింది. వీటికి సంబంధించి ఫిబ్రవరి 3న రెండు ప్రయోగాలను వేర్వేరు వాతావరణ సందర్భాల్లో చేసింది. తొలి ప్రయోగాన్ని 300 కి.మీ దూరం నుంచి, రెండో ప్రయోగాన్ని 245 కి.మీ దూరం నుంచి చేసినట్లు వెల్లడించింది. ఈ రెండు సందర్భాల్లోనూ వేగంగా తిరుగుతున్న ఐఎస్ఎస్‌ను ఏఎఫ్‌ఆర్ సెన్సర్లు స్పష్టంగా చిత్రీకరించాయని.. ట్రాకింగ్ అల్గరిథమ్‌లు, ఎలక్ట్రోఆప్టికల్ ఇమేజింగ్ వందశాతం కచ్చితత్వాన్ని ప్రదర్శించాయని తెలిపింది. ఈ రెండు సాంకేతికతలను దేశీయంగానే అభివృద్ధి చేశామని, కక్ష్యలోని వస్తువులను ట్రాక్ చేసేందుకు ఇవి ఉపయోగించవచ్చని అజిస్టా వెల్లడించింది. కమ్యూనికేషన్, నావిగేషన్, భూమి పరిశీలన, వ్యూహాత్మక అవసరాల కోసం ప్రస్తుతం భారత్ దాదాపు 50 శాటిలైట్లను ఆపరేట్ చేస్తోంది. వీటికి రక్షణ కల్పించేందుకు కక్ష్యలో ఇతర ఉపగ్రహాలు ఏం చేస్తున్నాయనే విషయం తెలుసుకోవడం ఎంతో అవసరమని నిపుణులు చెబుతున్నారు. ఈ నిఘా సామర్థ్యాలపై ఇస్రో ఇప్పటికే దృష్టి పెట్టగా.. వీటికి అజిస్టా వంటి ప్రైవేటు రంగ సంస్థల పరిశోధనలు మరింత దోహదం చేస్తాయని అంటున్నారు.

## ఆరోగ్యం కుంగిపోతున్నా.. కనికరం లేకుండా : బంగ్లాదేశ్‌లో మరో హిందూ నాయకుడి మరణం



బంగ్లాదేశ్‌లో మైనార్టీ వర్గం హిందువులు ఎదుర్కొంటున్న ఇబ్బందికర పరిస్థితులకు సంబంధించి మరో ఉదాహరణ వెలుగులోకి వచ్చింది. అవామీ లీగ్‌కు చెందిన మాజీ నాయకుడు కస్టడీలో ప్రాణాలు కోల్పోయాడు. రమేషన్ చంద్ర సేన్ (86) విద్యావేత్త, పార్లమెంటేరియన్, మాజీ మంత్రి. ఆయన గత 18 నెలలుగా జైల్లోనే ఉన్నారు. దీంతో ఆయన ఆరోగ్యం దెబ్బతిన్నది. ఆయన జైల్లో ఉన్న వేళే.. బలహీనంగా మారుతున్నట్లు పలుమార్లు కోర్టుకు వెల్లడించాడు. కానీ, బెయిల్ మాత్రం రాలేదని ఆయన కుటుంబ సభ్యులు వెల్లడించారు. దాదాపు 18 నెలలు జైల్లో ఉన్నా.. ఇప్పటికీ అక్కడి ప్రజలకు సేన్‌పై అభిమానం తగ్గలేదు. బంగ్లాదేశ్‌లో విద్యారంగం, రాజకీయాల్లో కొన్ని దశాబ్దాలుగా సేవలు అందించారు. దాదాపు 18 నెలల కిందట ఓ అల్లరిమూక ఆయనపై దాడి చేయగా.. పోలీసులు సేన్‌నే అదుపులోకి తీసుకొన్నారు. అరెస్ట్‌కు గల కారణాలు కూడా సరిగ్గా వెల్లడించలేదు. నాటి నుంచి ఆయన జైల్లోనే ఉన్నారు. ఒక కేసు తర్వాత మరోకేసును ఆయనపై బనాయిస్తూ వచ్చారని సేన్ కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఏ కేసులో అయినా.. బెయిల్‌పై బయటకు వస్తారనుకుంటే మరో కేసును మోపుతున్నారన్నారు. ఇటీవల కాలంలో సేన్ ఆరోగ్య స్థితి బాగా దిగజారింది. ఆయనకు చికిత్స తప్పని సరైంది. శనివారం రాత్రి ఆయన పరిస్థితి విషమించడంతో కస్టడీలోనే ప్రాణాలు విడిచారు.

## పాకిస్థానీ ఏజెంట్‌తో సంబంధాలు..
## గౌరవ్ గొగొయ్‌పై అస్సాం సీఎం తీవ్ర ఆరోపణలు




లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉపనేత గౌరవ్ గొగొయ్‌పై అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ తీవ్ర విమర్శలు చేశారు. ఆయనకు పాకిస్థానీ ఏజెంట్ అలీ తౌఖీర్ షేక్‌తో సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. ఆ ఏజెంట్ 2010-13 మధ్యకాలంలో 13 సార్లు భారత్‌కు వచ్చాడని, ప్రపంచవ్యాప్తంగా అతడు భారత వ్యతిరేక ప్రచారం చేశాడని పేర్కొన్నారు. ఈమేరకు గువాహటిలో నిర్వహించిన మీడియా సమావేశంలో హిమంత మాట్లాడారు. ''పాకిస్థానీ ఏజెంట్ అలీతో గౌరవ్ గొగొయ్, ఆయన సతీమణి, బ్రిటన్ పౌరురాలైన ఎలిజబెత్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఓ పాక్ సంస్థ ఆమెకు ఉద్యోగం ఇచ్చి, ఆ తర్వాత భారత్‌కు బదిలీ చేసింది. ఆమె జీతాన్ని అలీ చెల్లించాడు. అనంతరం ఆమె ఓ భారత సంస్థలో పనిచేస్తున్నప్పుడు.. ఆరు సార్లు ఇస్లామాబాద్‌కు వెళ్లారు. మరో స్వచ్ఛంద సంస్థలో చేరిన తర్వాత మూడుసార్లు పాక్‌ను సందర్శించారు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు అటారీ సరిహద్దు మీదుగా మాత్రమే వెళ్లేవారు. ఎప్పుడూ విమానం ఎక్కలేదు. ఎలిజబెత్‌కు చెల్లింపుల విషయంలో ఎఫ్‌సీఆర్ఏ నిబంధనల ఉల్లంఘన జరిగింది. భారత్‌కు సంబంధించిన సమాచారాన్ని ఆమె సేకరించి.. అలీకి నివేదికలు ఇచ్చేవారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాతావరణ చర్యలకు సంబంధించి ఇంటెలిజెన్స్ వర్గాల నుంచి సమాచారాన్ని సేకరించారు. మరోవైపు.. తన భార్యకు సంబంధించిన పాకిస్థానీ బ్యాంకు ఖాతా వివరాలను గొగొయ్ ఎన్నికల అఫిడవిట్‌లో ప్రస్తావించలేదు. గొగొయ్ సైతం తన వివాహానికి ముందు 2013లో రహస్యంగా పాకిస్థాన్ వెళ్లారు. ఆ సమయంలో ఆయన అస్సాం సీఎం నివాసంలో ఉండేవారు. లాహోర్‌కు మాత్రమే వెళ్లేందుకు వీసా జారీ అయినప్పటికీ.. ఇస్లామాబాద్, కరాచీ సందర్శించారు. ఈ పర్యటన గురించి అస్సాం పోలీసులకు సమాచారం ఇవ్వలేదు. తాను బస చేసిన 10 రోజుల పాటు డిజిటల్ ప్రపంచానికి దూరంగా ఉన్నారు. అక్కడ ఆయనకు ఏదో రకమైన శిక్షణ ఇచ్చారని అనుమానిస్తున్నాం. ఆ పర్యటన తర్వాత ఆయన పార్లమెంటులో రక్షణ పరికరాలు, అణు విద్యుత్ ప్లాంట్లపై ప్రశ్నలు అడిగారు. ఈ వ్యవహారంపై అస్సాం ప్రభుత్వం దర్యాప్తు ప్రారంభించిన తర్వాత.. పాక్ ఏజెంట్ తన అన్ని ట్వీట్లను డిలీట్ చేశాడు. గౌరవ్, ఆయన సతీమణికి ఆ ఏజెంట్‌తో సంబంధం ఉందని విశ్వసిస్తున్నాం. పొరుగు దేశంతో సంబంధాల విషయమై గొగొయ్‌ను మేం ఇప్పటివరకు విచారించలేదు. ఆయన పదవికి గౌరవం ఇస్తూ.. ఆ విషయాన్ని కేంద్రానికే వదిలిపెట్టాం. ఈ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తునకు సిఫార్సు చేస్తున్నాం'' అని తెలిపారు.

# రత్నాల హారాలకు జుంకా పెండెంట్‌లు!


నగలంటే ఇష్టపడని అమ్మాయిలు అరుదుగా ఉంటారేమో కదా! కానీ, ఈ మధ్య పసిడి పరుగులు పెడుతూ వారిని కలవరపెడుతోంది. అలాగని శుభకార్యాలకూ, జీవితంలో ముఖ్యమైన సందర్భాలకూ కొనుక్కోకుండా ఉండలేం. పెద్ద ఎత్తున పెట్టుబడీ పెట్టలేం. ఇలాంటివారికోసమే తయారీదారులు పచ్చలు, ముత్యాలు, పగడాలు... మరెన్నో రకాల సహజాతి రత్నాలు, స్టోన్స్‌తో హారాలను రూపొందిస్తున్నారు. ఈ ప్రత్యామ్నాయం అందాన్నీ, హుందాతనాన్నీ ఇవ్వడమే కాదు, మోడర్న్ టచ్‌నీ అద్దుకోవడం వల్ల ఈ తరాన్నీ మెప్పిస్తోంది. వరుసల్లో మెరిసిపోతూ కనిపించే వీటికి జుంకాలను పోలి ఉండే పెండెంట్ కొత్తదనాన్ని తెచ్చిపెడుతున్నాయి. పోల్కీలు, వజ్రాలు, ముత్యాలు, పచ్చలు, కుందన్లు అద్దుకుని ఆకర్షణీయంగా అలరిస్తున్నాయి. పట్టు కట్టినా, ఫ్యూజన్ డ్రెస్ వేసినా... అదరగొట్టేస్తున్నాయీ బీడ్స్ హారాలు. వీటినోసారి మీరూ చూసేయండి.











# వెల్లుల్లి.. తింటున్నారా?

* ఉల్లిలాగే.. వెల్లుల్లి కూడా ఆరోగ్యానికి ఎంతో మంచిది. వెల్లుల్లిని రోజూ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా బోలెడన్ని ఆరోగ్య ప్రయోజనాలు పొందచ్చంటున్నారు నిపుణులు.



**మెరుగయ్యే రక్తప్రసరణ..**
వెల్లుల్లిని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అది శరీరం లోపల రక్తం గడ్డ కట్టకుండా కాపాడుతుంది. ఇందులోని యాంటీ క్లాటింగ్ గుణాలే దీనికి కారణం. ముఖ్యంగా గుండె జబ్బుతో బాధపడే వారు వెల్లుల్లిని రోజూ ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల గుండెకు రక్తప్రసరణ మెరుగుపడుతుందని నిపుణులు చెబుతున్నారు. కానీ వివిధ రకాల శస్త్రచికిత్సలు చేయించుకోబోయే వారు మాత్రం వెల్లుల్లి వినియోగం విషయంలో ఓసారి వైద్యుడిని సంప్రదించి తగిన సలహా తీసుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు.

**కొవ్వును కరిగిస్తుంది!**
అధిక బరువుతో ఇబ్బందిపడేవారు వెల్లుల్లిని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల ప్రయోజనం పొందే అవకాశాలున్నాయంటున్నారు నిపుణులు. కారణం వెల్లుల్లిలో ఉండే అలిసిన్ అనే పదార్థమే. ఇందులోని ఔషధ గుణాలు రక్తంలోని ట్రైగ్లిజరైడ్స్‌ని తగ్గించి, శరీర బరువును తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని చెబుతున్నారు.

**వీటికీ మంచి మందే..!**
వెల్లుల్లి తీసుకోని వారితో పోల్చితే.. తరచూ ఆహారంలో భాగంగా దీన్ని తీసుకునే వారిలో జలుబు, ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలు తక్కువగా వస్తాయట! వీటితో పాటు వెల్లుల్లిలోని యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాల కారణంగా గొంతు సంబంధిత సమస్యలు బాధించవు. అందుకే గొంతు నొప్పితో బాధపడేవారు వెల్లుల్లిని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చంటున్నారు నిపుణులు.




# నూనె చిట్లి మీద పడకుండా..!

**వంట చేసే క్రమంలో చేతులు కాలడం చాలామంది మహిళలకు అనుభవమే! ముఖ్యంగా పోపు వేసేటప్పుడు నూనె చిట్లి చేతులు, ఒంటిపై పడుతుంటుంది. దీనివల్ల కూడా ఆయా భాగాల్లో బొబ్బలెక్కడం, కాలిన మరకలు ఏర్పడడం.. వంటివి జరుగుతుంటాయి. మరోవైపు కిచెన్ టైల్స్ పైనా ఈ నూనె మరకలు పడి జిడ్డుగా మారుతుంటుంది. మరి, ఇలా జరగకుండా ఉండాలంటే ఈ చిన్న చిన్న చిట్కాలు పాటిస్తే సరిపోతుందంటున్నారు నిపుణులు.**





* నూనెకు, నీటికి పడదు. ఈ క్రమంలో ఆకుకూరలు, కూరగాయలు మొదలైనవి ముందుగానే కడిగి, కట్ చేసి గిన్నెలో లేదా జాలీ లాంటి పాత్రల్లో వేసుకుంటే సులభంగా ఆరిపోతాయి.
* నూనె బాగా వేడెక్కినా.. అందులో పోపు దినుసులు, ఇతర పదార్థాలు వేశాక చిట్లుతుంటుంది. అలాగే అవి త్వరగా మాడిపోతాయి కూడా! కాబట్టి మరీ ఎక్కువగా వేడెక్కకుండా చూసుకోవాలి.




* ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన కాయగూరల ముక్కలు, ఇతర పదార్థాల్లో తేమ నిలిచి ఉంటుంది. కాబట్టి వాటిని వెనువెంటనే నూనెలో వేసినా చిట్లే ప్రమాదం ఎక్కువ. కాబట్టి ముందుగానే వాటిని ఫ్రిజ్‌లో నుంచి తీసి గది ఉష్ణోగ్రత వద్ద ఉంచాలి. వాటిలోని చల్లదనం తగ్గాక.. వాడితే సమస్య ఉండదు.
* ఒక్కోసారి తొందరలో తడిగా ఉన్న పాత్రలోనే నూనె పోస్తుంటాం. దీనివల్ల కూడా నూనె చిట్లుతుంటుంది. కాబట్టి పాత్ర కాస్త వేడెక్కాక నూనె పోయడం మంచిది.
* చాలామంది వంట త్వరగా పూర్తి కావాలన్న ఉద్దేశంతో మంట పెంచేస్తుంటారు. దీనివల్ల నూనె బాగా వేడెక్కి చిట్లడంతో పాటు కూర కూడా మాడిపోతుంది. అందుకే తక్కువ మంటపై వండితేనే అటు రుచి, ఇటు సురక్షితం..!
* అలాగే కిచెన్ ప్లాట్‌ఫామ్, స్టౌ బర్నర్స్, స్టౌ వెనక వైపున్న టైల్స్, ర్యాక్స్‌పై నూనె మరకలు పడకుండా ఉండేందుకు బేకింగ్ షీట్స్ అతికించచ్చు.
* నూనె చిట్లి మీద పడకుండా, కిచెన్ ప్లాట్‌ఫామ్ జిడ్డుగా మారకుండా.. ఇప్పుడు వివిధ రకాల గ్యాడ్జెట్స్ మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. ఇలాంటి వాటిని కూడా వినియోగించచ్చు.





# మనసు దోచే మక్రామె..!

కొత్తగా ఇల్లు కట్టుకుని ఇంటీరియర్ కోసం బడ్జెట్‌లో ప్లాన్ చేసుకోవాలా? ప్లాస్టిక్ అలంకరణలకు దూరంగా పర్యావరణహితంగా ఇంటిని అలంకరించుకోవాలి అనుకుంటున్నారా? అయితే ఈ మక్రామె వాల్ ఆర్ట్‌లు మీకు నచ్చితీరతాయి. కాటన్, ఊలు, జ్యూట్, లినెన్ దారాలతో చేతితో తయారుచేసిన ఈ అలంకరణలు ఇంటికి మినమలిస్ట్ లుక్‌ని అందిస్తాయి. అంతేకాదు, ఇంటికి పాజిటివ్ వైబ్‌ని తెచ్చి మనలో ఒత్తిడినీ తగ్గిస్తాయట. అందుకే వీటిని కాన్వాస్‌లు, వాల్ హ్యాంగింగ్స్, పాట్ హ్యాంగింగ్స్, కర్టెన్లు, టేబుల్ రన్నర్స్ రూపంలో తీసుకొచ్చారు తయారీదారులు. బెడ్‌రూమ్, లివింగ్ రూమ్, పిల్లల గది, కార్నర్ డెకార్‌గానూ అలంకరించుకోవచ్చు. అంతేకాదు, కొందరికి గోడలమీద జిగేల్‌మనిపించే రంగులు నచ్చకపోవచ్చు. అలాగని డబ్బులు పెట్టి వాల్ డెకార్లు చేయించుకోలేకపోవచ్చు. అలాంటి వాళ్లు ఈ సహజ మక్రామె వాల్ ఆర్ట్‌లు అమర్చి చూడండి.

స్టన్నింగ్ యాక్టింగ్‌తో సినిమాకే

# హైలెట్‌గా అర్జున్ మహి



**టాకీస్:** ఇష్టంగా సినిమాతో హీరోగా డెబ్యూ ఇచ్చాడు అర్జున్ మహి. ఆ తర్వాత ఎంజాయ్, నువ్వు నేను ఒసేయ్ ఒరేయ్ సినిమాలు చేశాడు. తాజాగా బరాబర్ ప్రేమిస్తా చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చి తన యాక్టింగ్‌తో టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తున్నాడు అర్జున్ మహి. చంద్రహాస్ హీరోగా వచ్చిన బరాబర్ ప్రేమిస్తా చిత్రంలో హీరోయిన్ సోదరుడి పాత్రలో నటించాడు.

చంద్రహాస్, అర్జున్ మహి మధ్య వచ్చే సన్నివేశాలు.. ప్రత్యేకించి యాక్షన్ సన్నివేశాలు సినిమాకే హైలెట్‌గా నిలుస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. అర్జున్ మహి యాక్టింగ్‌కు ఓ వైపు ప్రేక్షకులు, మరోవైపు క్రిటిక్స్ నుంచి ప్రశంసలు అందుతున్నాయి. అర్జున్ మహి తన పాత్ర కోసం 15 కిలోలు కూడా పెరిగాడంటే ఎంత పట్టుదలగా పనిచేశాడో అర్థం చేసుకోవచ్చు. డెడికేటెడ్ యాక్టర్‌గా తనను తాను నిరూపించుకునే పనిలో ఉన్న అర్జున్ మహి ప్రస్తుతం లీడ్ యాక్టర్‌గా రెండు సినిమాలు ఓకే చేయగా త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనున్నాయి. మొత్తానికి ఓ వైపు హీరోగా చేస్తూనే.. మరోవైపు పవర్ ఫుల్ కథలు దొరికితే చేసేందుకు రెడీ అంటూ చెప్పకనే చెబుతూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తున్నాడు.

# వాళ్లిద్దరికీ మాత్రం సిస్టర్‌గా నటించలేను

సురేఖవాణి కుమార్తె సుప్రీత

విజయ్ దేవరకొండ, అఖిల్‌కు సోదరిగా నటించనని చెప్పిన సుప్రీత

పవన్ కల్యాణ్, ఎన్టీఆర్ వంటి హీరోలకు సిస్టర్ పాత్రలు చేస్తానని వెల్లడి

తప్పుడు డైటింగ్ వల్ల ప్రాణాల మీదకు తెచ్చుకున్నానని భావోద్వేగం

'అమరావతికి ఆహ్వానం' సినిమాతో హీరోయిన్‌గా పరిచయం

ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకు రానున్న సుప్రీత తొలి చిత్రం




టాకీస్: సీనియర్ నటి సురేఖావాణి కుమార్తె సుప్రీత హీరోయిన్‌గా వెండితెరకు పరిచయం అవుతున్న విషయం తెలిసిందే. తన తొలి చిత్రం 'అమరావతికి ఆహ్వానం' ప్రమోషన్లలో భాగంగా ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. మంచి కథ వస్తే క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా చేయడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే ఇద్దరు హీరోలకు మాత్రం మాత్రం చెల్లిగా నటించనని పేర్కొంది.

"పవన్ కల్యాణ్, ఎన్టీఆర్ వంటి స్టార్లకు చెల్లిగా నటించే అవకాశం వస్తే తప్పకుండా చేస్తాను. కానీ, విజయ్ దేవరకొండ, అఖిల్ అక్కినేనిలకు మాత్రం సిస్టర్ గా చేయను" అని సుప్రీత స్పష్టం చేసింది. వాళ్లిద్దరూ అంటే తనకు చాలా ఇష్టమని, టెన్త్ క్లాస్ పాసయితే అఖిల్ తో డిన్నర్ కు తీసుకెళతానని అమ్మ మాటిచ్చిందని సుప్రీత వెల్లడించింది. కానీ ఇంతవరకు అది నెరవేరలేదని విచారం వ్యక్తం చేసింది. హీరోయిన్‌గా మాత్రమే కాకుండా విభిన్న పాత్రలు పోషించడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఆమె తెలిపింది. సుప్రీత నటిస్తున్న 'అమరావతికి ఆహ్వానం' అనే హారర్ చిత్రం ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఇదే ఇంటర్వ్యూలో తన జీవితంలో ఎదుర్కొన్న ఓ భయంకరమైన అనుభవాన్ని కూడా సుప్రీత పంచుకుంది. బరువు పెరిగావంటూ చుట్టూ ఉన్నవారు అనడంతో తీవ్రమైన ఒత్తిడికి గురయ్యానని, దాంతో బరువు తగ్గాలని తప్పుడు డైటింగ్ పద్ధతులు పాటించానని సుప్రీత భావోద్వేగంతో చెప్పింది. "ఒత్తిడి పెరిగినప్పుడల్లా ఇంకా ఎక్కువ తినేదాన్ని. దాంతో లావయ్యాను. వెంటనే బరువు తగ్గాలని నిర్ణయించుకుని, రోజుకు ఒక పూట మాత్రమే తినడం మొదలుపెట్టా. సుమారు 12 నుంచి 15 గంటలు ఏమీ తినకుండా ఉండేదాన్ని. బిర్యానీలు తినడంతో ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింది" అని ఆమె వివరించారు.

ఆరోగ్య సమస్యలు తీవ్రం కావడంతో ఆసుపత్రిలో చేరాల్సి వచ్చిందని, అక్కడ 15 రోజుల పాటు నరకం చూశానని కన్నీటిపర్యంతమయ్యారు. "మంచినీళ్లు తాగినా వాంతులయ్యేవి. దాదాపు 20 రోజులు అన్నం తినలేదు. రోజుకు 15 సార్లు వాంతులు చేసుకున్నా. ఒక దశలో నేను బతకనేమో అనుకున్నా. ఈ బాధ భరించడం కన్నా చనిపోవడం మంచిదనిపించింది. కానీ దేవుడి దయతో కోలుకుని ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నాను" అని సుప్రీత తెలిపింది. తన అనుభవం అందరికీ ఒక గుణపాఠం కావాలని, ఆరోగ్యం విషయంలో అజాగ్రత్త వద్దని ఆమె సూచించారు.

# ఓటీటీలోనూ దుమ్మురేపుతున్న 'ధురంధర్'

గ్లోబల్ టాప్ -10 నాన్ ఇంగ్లిష్ ఫిల్మ్స్ జాబితాలో

నెం.1 స్థానాన్ని దక్కించుకున్న ధురంధర్

ఇండియాతో పాటు పాకిస్థాన్‌లోనూ మూవీకి విశేష ఆదరణ

ఇప్పటివరకు ఈ సినిమాకు 7.6 మిలియన్ వ్యూస్ దక్కాయన్న నెట్‌ఫ్లిక్స్



**టాకీస్:** బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్న ధురంధర్ ఓటీటీలోనూ సెన్సేషన్ సృష్టిస్తోంది. తాజాగా నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ మూవీ గ్లోబల్ టాప్ -10 నాన్ ఇంగ్లిష్ ఫిల్మ్స్ జాబితాలో నెం.1 స్థానాన్ని దక్కించుకుంది. ఇండియాతో పాటు పాకిస్థాన్‌లోనూ ఈ మూవీకి విశేష ఆదరణ లభిస్తుండటం విశేషం. నెట్‌ఫ్లిక్స్ విడుదల చేసిన తాజా వీక్లీ నివేదిక ప్రకారం 'ధురంధర్' టాప్‌లో నిలిచింది. ఇప్పటివరకు ఈ సినిమాకు 7.6 మిలియన్ వ్యూస్ దక్కినట్లు వెల్లడించింది.

2025 డిసెంబరు 5న థియేటర్లలో విడుదలైన ఈ మూవీ తొలి షో నుంచే మౌత్ టాక్‌తో దూసుకెళ్లింది. సీక్రెట్ ఏజెంట్‌గా హీరో రణ్‌వీర్ సింగ్ లుక్స్, యాక్టింగ్‌తో పాటు విలన్‌గా అక్షయ్ ఖన్నా నటన ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. యాక్షన్ సన్నివేశాలు కూడా సినిమాకు ప్లస్‌గా మారాయి. దీంతో బాక్సాఫీస్ వద్ద వసూళ్ల రికార్డులు సృష్టించిన 'ధురంధర్' దాదాపు రూ.1400 కోట్ల కలెక్షన్లతో అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాల్లో ఒకటిగా నిలిచింది. ఎక్కువ కలెక్షన్లు రాబట్టిన భారతీయ చిత్రాల జాబితాలో నాలుగో స్థానంలో నిలిచిన ఈ సినిమా.. కేవలం ఒక్క భాషలో (హిందీ) విడుదలై అత్యధిక వసూళ్లు సాధించిన రెండో చిత్రంగా రికార్డు సాధించింది.

ప్రస్తుతం ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్ వేదికగా హిందీతో పాటు తెలుగు, తమిళ భాషల్లోనూ స్ట్రీమింగ్ అవుతోంది. ఇక ఈ చిత్రానికి కొనసాగింపుగా 'ధురంధర్ 2' కూడా సిద్ధమవుతోంది. ఈ చిత్రాన్ని మార్చి 19న విడుదల చేయనున్నట్లు సమాచారం. దాదాపుగా షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సీక్వెల్ ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. కథలో ఒకటి రెండు కొత్త పాత్రలను జోడిస్తున్నట్లు బాలీవుడ్ టాక్. దర్శకుడు ఆదిత్యధర్ అదనపు మెరుగులు దిద్ది చిత్రాన్ని మరింత గ్రాండ్‌గా సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల విడుదల చేసిన 'ధురంధర్ 2' టీజర్ ప్రేక్షకుల్లో అంచనాలను భారీగా పెంచింది.

ఎమోషన్ అండ్ యాక్షన్ కలయికగా

# 'సీతా పయనం'.. ఆకట్టుకుంటున్న ట్రైలర్!




**టాకీస్:** యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం 'సీతా పయనం'. ఈ సినిమా ద్వారా ఆయన కుమార్తె ఐశ్వర్య అర్జున్ హీరోయిన్‌గా పరిచయ మవుతుండగా.. కన్నడ స్టార్ ఉపేంద్ర మేనల్లుడు నిరంజన్ సుధీంద్ర ఈ చిత్రంలో కథానాయ కుడిగా నటిస్తున్నాడు. ప్రేమికుల రోజు కానుకగా ఫిబ్రవరి 14న ఈ సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం శనివారం థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేసింది. ట్రైలర్ చూస్తుంటే.. ఒక చెఫ్ అయిన ఐశ్వర్య తన కారులో ప్రయాణిస్తూ, నిరంజన్ అనే తెలియని వ్యక్తికి లిఫ్ట్ ఇవ్వడంతో ఈ ప్రయాణం మొదలవుతుంది. అయితే ఈ ప్రయాణంలో వారి మధ్య సాగే సరదా సంభాషణలు, ఎదురయ్యే మలుపులు ఏంటి అనేది సినిమా కథ. ఈ సినిమాలో సత్యరాజ్, ప్రకాష్ రాజ్, కోవై సరళ వంటి సీనియర్ నటులు కీలక పాత్రల్లో నటిస్తుండగా.. అర్జున్ సర్జా ఒక పవర్ ఫుల్ పాత్రలో మెరుస్తున్నాడు. ఆయన మేనల్లుడు ధ్రువ సర్జా స్పెషల్ కామియో రోల్‌లో కనిపించబోతున్నాడు. మెలోడీ కింగ్ అనూప్ రూబెన్స్ అందించిన సంగీతం, సాయి మాధవ్ బుర్రా రాసిన డైలాగ్స్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. బాలమురుగన్ సినిమాటోగ్రఫీ విజువల్స్ చాలా ఫ్రెష్‌గా ఉన్నాయి.

# శ్రీవారి సన్నిధిలో నిధి అగర్వాల్..



**టాకీస్:** ప్రముఖ నటి నిధి అగర్వాల్ ఈ రోజు ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం తిరుమల చేరుకున్న నిధి అగర్వాల్ కు టీటీడీ అధికారులు స్వాగతం పలికి వీఐపీ బ్రేక్ దర్శనం కల్పించారు. స్వామి వారిని దర్శించుకున్న తర్వాత రంగనాయకుల మండపంలో నిధి అగర్వాల్ కు వేద పండితులు ఆశీర్వచనం చేశారు. స్వామివారి తీర్థప్రసాదాలను ఆమెకు అందజేశారు. ఆలయం నుంచి వెలుపలికి వచ్చిన తర్వాత నిధి అగర్వాల్ తో సెల్ఫీల కోసం భక్తులు ఉత్సాహం ప్రదర్శించారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.